RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 157 | జులై 08 బుధవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 157 | July 08 Wednesday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఈ నెల 10న ఖమ్మంలో ప్రతిష్టాత్మక 'రైతు ఆశీర్వాద సభ': ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల 2

# సిట్ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు

## అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసు:



**అయోధ్య జనసంఘర్షణ**

అయోధ్య రామమందిరంలో జరిగిన విరాళాల చోరీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కీలక ఆధారాలను సేకరించి, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పించింది. ఆలయ విరాళాల లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న కొందరు సిబ్బంది పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు సిట్ విచారణలో తేలింది. ముఖ్యంగా ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 మధ్య కాలంలో జరిగిన లెక్కింపు సమయంలో నిందితులు నోట్ల కట్టలను, చిల్లర డబ్బులను తమ దుస్తులు, జేబులు, బూట్లలో దాచి తరలిస్తుండగా సీసీటీవీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యింది. కేవలం ఈ 39 రోజుల్లోనే నిందితులు సుమారు 70 సార్లు దొంగతనానికి ఒడిగట్టినట్లు అధికారులు గుర్తించారు. ఇంత జరుగుతున్నా అక్కడి కొందరు ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం, వారిని

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సవాల్

## అసెంబ్లీలో ప్రత్యేక చర్చకు సిద్ధం

**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, అవినీతిపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాభవన్ వేదికగా నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ప్రాజెక్టు ప్రస్తుత దుస్థితిని వివరిస్తూ, మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. కాళేశ్వరం అంశంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎప్పుడు లేఖ రాస్తే అప్పుడే సభను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. చర్చలో కేసీఆర్ వాదనలో బలం ఉందని నిరూపిస్తే, రాబోయే మూడేళ్ల పాటు కాళేశ్వరం మరమ్మతుల బాధ్యతను, మేజర్ కాంట్రాక్టును ఆయనకే అప్పగిస్తామని, ఆయన ఇష్టం వచ్చిన వారికి ఆ పనులు ఇప్పించుకోవచ్చంటూ సంచలన సవాల్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను రేవంత్ రెడ్డి 'ఆర్థిక ఉగ్రవాదులు'గా అభివర్ణించారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన సెక్రటేరియట్,



ప్రజాభవన్‌లను తాము వాడుకుంటున్నామని, కానీ కాళేశ్వరాన్ని మాత్రం అవినీతి, కమీషన్ల కోసమే రీడిజైన్ చేయడం వల్ల అది నిరూపయోగంగా మారిందని

➤ మిగతా 2వ పేజిలో..

# 38 మందికి ఉరిశిక్ష

- అహ్మదాబాద్ వరుస పేలుళ్ల కేసు:
- సమర్థిస్తూ గుజరాత్ హైకోర్టు చారిత్రాత్మక తీర్పు

**అహ్మదాబాద్ జనసంఘర్షణ**

దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ కేసులో 2022లో ప్రత్యేక న్యాయస్థానం విధించిన శిక్షలను పూర్తిగా సమర్థిస్తూ.. 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను ఖరారు చేస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. చట్టప్రకారం మరణశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో పాటు, కింది కోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు సుదీర్ఘ విచారణ జరిపింది. చివరికి నిందితుల పిటిషన్లను

➤ మిగతా 2వ పేజిలో..

# భారీ వర్షాలతో ముంబై జలమయం

## పశ్చిమ కనుమల్లో విరిగిపడిన కొండచరియలు, రాకపోకలు స్తంభన

**ముంబై జనసంఘర్షణ**

దేశ ఆర్థిక రాజధాని ముంబైతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాలను కుండపోత వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత 24 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ముంబైలోని అనేక లోతట్టు ప్రాంతాలు పూర్తిగా చెరువులను తలపిస్తున్నాయి. రహదారులపై భారీగా నీరు చేరడంతో నగరంలో ట్రాఫిక్‌కు

➤ మిగతా 2వ పేజిలో..

# సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గని కేటాయింపు

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి




**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణలోని ప్రతిష్మాత్మక సింగరేణి కాలరీస్ సంస్థ పురోగతికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 'తాడిచర్ల-2' బొగ్గు గనిని సింగరేణి సంస్థకు నేరుగా కేటాయించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ కేటాయింపునకు సంబంధించిన దస్త్రంపై మంగళవారం తానే స్వయంగా సంతకం చేసినట్లు ఆయన న్యూఢిల్లీలో మీడియాకు తెలిపారు. గతంలో పలువురు ముఖ్యమంత్రులు ఈ గనిని సింగరేణికి ఇవ్వాలని కేంద్రానికి లేఖలు రాసినప్పటికీ ఫలితం లేకపోయిందని, ఇప్పుడు ఆ అభ్యర్థన నెరవేరిందని చెప్పారు. తాడిచర్ల-2 బ్లాక్‌లో సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, దీని ద్వారా ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు చొప్పున రాబోయే 40 నుంచి 50 ఏళ్ల పాటు నిరంతరాయంగా ఉత్పత్తి సాధించవచ్చని పేర్కొన్నారు. వేలం ప్రక్రియ (ఆక్షన్ ప్రీమియం) లేకుండా నేరుగా ఈ గనిని కేటాయించడం వల్ల సింగరేణి సంస్థకు రూ.2,550 కోట్లు ఆదా అవ్వడమే కాకుండా, భవిష్యత్తులో మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ లభించే అవకాశం ఉందన్నారు. అలాగే ఈ ప్రాజెక్ట్ ద్వారా రాయల్టీ రూపంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా సుమారు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని ఆయన వివరించారు. దేశాభివృద్ధిలో సహకార సమాఖ్య విధానాన్ని పాటిస్తూ అన్ని రాష్ట్రాలతో కలిసి కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని, గత 12 ఏళ్లుగా సింగరేణి అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా అండగా నిలుస్తోందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం సింగరేణి పరిధిలో ఉన్న 39 గనుల (21 భూగర్భ, 18 ఓపెన్ కాస్ట్ గనులు) పర్యావరణ, అటవీ అనుమతులను వేగవంతం చేయడంలో కేంద్రం నిరంతరం సహకరిస్తోందని తెలిపారు. లక్షలాది మంది కార్మికుల గుండెచప్పుడుగా ఉన్న సింగరేణి, తెలంగాణ ఉద్యమంలోనూ కీలక

➤ మిగతా 2వ పేజిలో..

# కేరళలో మళ్లీ వర్షాల బీభత్సం

## వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి



**తిరువనంతపురం జనసంఘర్షణ**

కేరళలో కురుస్తున్న భారీ వర్షాలు మరోసారి వయనాడ్ జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపాయి. మంగళవారం మధ్యాహ్నం మేప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద మలప్పురం-వయనాడ్ జిల్లాలను కలిపే ఒక సొరంగ మార్గ నిర్మాణ ప్రాంతంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘోర ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, శిథిలాల కింద చిక్కుకున్న ఆరుగురిని స్థానికులు సురక్షితంగా బయటకు తీశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా (సుమారు 265 మి.మీ వర్షపాతం) కొండపై నుంచి ఒక్కసారిగా మట్టి, బండరాళ్లు వచ్చి పడటంతో మీనాక్షి వంతెన సమీపంలోని నిర్మాణ ప్రాంతం పూర్తిగా మునిగిపోయింది. సొరంగం పనులను ముందుగానే నిలిపివేసినప్పటికీ, కార్మికులు ఉండే వసతి గృహాలతో పాటు సమీపంలోని కొన్ని ఇళ్లు, హోమ్‌స్టేలపై ఈ మట్టి దిబ్బలు పడ్డాయి. ప్రమాద సమయంలో

➤ మిగతా 2వ పేజిలో..

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సవాల్

**మొదటిపేజీ తరువాయి..** మండిపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో బ్యారేజీలలో నీటిని నింపి ఎత్తిపోయాలని ఏ నిపుణుల కమిటీ కూడా చెప్పలేదని సీఎం స్పష్టం చేశారు. ఒకవేళ బలవంతంగా నీరు నింపితే బ్యారేజీలు పూర్తిగా కుప్పకూలి, భద్రాచలం పట్టణం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకపోయినా, గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల తాము వేల కోట్ల అప్పులు కట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ ఇచ్చిన అభ్యంతరాల నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టి, తనకు నచ్చినట్లు నివేదిక ఇచ్చేలా బాధ్యతలను 'వ్యాప్కోస్' సంస్థకు అప్పగించారని ఆరోపించారు. దీనివల్ల రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.లక్ష కోట్లకు పెరిగిందని, చివరకు వ్యయం రూ.1.47 లక్షల కోట్లకు చేరినట్లు కాగ్ సైతం తెలిపిందని గుర్తుచేశారు. వ్యయం పెరిగినా ఆయకట్టు మాత్రం పెరగలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి జలయజ్ఞంలో భాగంగా 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల' ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్ద తలపెట్టారని, తద్వారా 16 లక్షల ఎకరాలకు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని రేవంత్ పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కమీషన్ల కోసం ప్రాజెక్టును రీడిజైన్ చేశారని, కేసీఆర్, కేటీఆర్‌లు ఇంజనీర్లు కాదని, కేవలం మాటలతో మభ్యపెట్టే 'మానిప్యులేటర్లు' అని ఎద్దేవా చేశారు. నిబంధనల ప్రకారం బ్యారేజీలను దశలవారీగా నింపాల్సి ఉండగా, కట్టిన ఏడాదికే పూర్తి స్థాయిలో నీరు నింపడం వల్లే ఒత్తిడి ఎక్కువై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కుంగాయన్నారు. ఇసుక పునాదులపై బ్యారేజీలు కట్టడం వల్లే 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ వద్ద ఆరు పిల్లర్లు కుంగాయని, అంతకుముందు 2022 వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిపోయిందని తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పరిధిలో అసలు ఆయకట్టే లేదని విమర్శించారు. కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలు శిక్ష అనుభవించకూడదని, ప్రజాధనం వృథా కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 10న ఖమ్మంలో ప్రతిష్టాత్మక 'రైతు ఆశీర్వాద సభ': ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

తెలంగాణలో రైతు సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ బహిరంగ సభకు సర్వం సిద్ధం చేస్తోంది. గత నెలలో అనివార్య కారణాల వల్ల రద్దయిన ప్రతిష్టాత్మక 'రైతు ఆశీర్వాద సభ'ను తిరిగి ఈ నెల 10వ తేదీన ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించాలని నిర్ణయించింది. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఈ భారీ సదస్సుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభా ప్రాంగణాన్ని స్వయంగా సందర్శించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలోనే రికార్డు స్థాయిలో రైతు భరోసా నిధులను అన్నదాతలకు అందజేసిందని కొనియాడారు. కేవలం ఏడు రోజుల వ్యవధిలోనే ఏకంగా రూ.7,491 కోట్ల నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని, వ్యవసాయ రంగానికి తమ ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో చెప్పడానికి ఇదే నిదర్శనమని స్పష్టం చేశారు. మరోవైపు, ఎల్‌నినో పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో రైతాంగానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా తట్టుకునేలా జిల్లాల వారీగా ప్రత్యామ్నాయ సాగు ప్రణాళికలను సిద్ధం చేసి, అమలు చేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావంపై అగ్రి వర్సిటీ పరిశోధకులు చేసిన శాస్త్రీయ సూచనలను క్షేత్రస్థాయిలోని రైతులకు సకాలంలో చేరవేయాలని ఆదేశించారు. ఇప్పటికే 'తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం' ద్వారా వాట్సప్ వేదికగా రైతులకు ఎప్పటికప్పుడు కచ్చితమైన వాతావరణ అంచనాలను చేరవేస్తున్నామని, వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలను తక్షణమే క్షేత్రస్థాయిలో అమలు చేయాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## సిట్ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు

**మొదటిపేజీ తరువాయి..** అడ్డుకోకపోవడం గమనార్హం. దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు ఆలయ ట్రస్ట్ సభ్యులు, బ్యాంక్ సిబ్బంది, భద్రతా సిబ్బందితో పాటు లెక్కింపులో పాల్గొన్న వారిని సుదీర్ఘంగా విచారించి వాంగ్మూలాలు నమోదు చేశారు. అయితే, ఏప్రిల్ 27 కంటే ముందు కూడా ఇటువంటి చోరీలు జరిగి ఉంటాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, పాత సీసీటీవీ ఫుటేజ్ అందుబాటులో లేకపోవడం దర్యాప్తునకు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో పూర్తి నిజాలు రాబట్టేందుకు గత ఐదేళ్ల నాటి ఆర్థిక లావాదేవీలపై అధికారులు రీ–ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బ్యాంక్ రికార్డులు, ఆలయ నిర్మాణ వ్యయాలు, విరాళాల పత్రాలతో పాటు భక్తులు సమర్పించిన బంగారం, వెండి వస్తువుల వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఆలయ భద్రతా తనిఖీలు, బయోమెట్రిక్ హాజరు, డిజిటల్ పరికరాల వాడకంపై ఆంక్షలు, సీసీటీవీ పర్యవేక్షణ వంటి కీలక విభాగాల్లో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకునే నిందితులు ఈ దొంగతనాలకు పాల్పడినట్లు సిట్ నిర్ధారించింది. అలాగే విలువైన కానుకల నిర్వహణ, డాక్యుమెంటేషన్‌లో కూడా తీవ్రమైన లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ ముఠాలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రాల ప్రమేయం ఉన్నట్లు తేలగా, వీరిలో అవినాష్ శుక్లా, మనీష్ కుమార్ యాదవ్‌లు పలుమార్లు నగదు, నగలను కాజేస్తున్న దృశ్యాలు సీసీటీవీల్లో స్పష్టంగా నిక్షిప్తమయ్యాయి.

## 38 మందికి ఉరిశిక్ష

**మొదటిపేజీ తరువాయి..** కొట్టివేస్తూ కింది కోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ భీభత్సానికి సంబంధించిన నేపథ్యాన్ని పరిశీలిస్తే.. 2008 జులై 26న అహ్మదాబాద్ నగరంలో కేవలం 70 నిమిషాల వ్యవధిలో ఆసుపత్రులతో సహా 21 ప్రాంతాలలో ఉగ్రవాదులు వరుస బాంబు దాడులకు తెగబడ్డారు. ఈ దారుణ ఘటనలో 56 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా, 246 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుళ్ల ధాటికి సమీపంలో ఉన్న చాలా మంది కొంతకాలం పాటు వినికిడి శక్తిని కూడా కోల్పోయారు. ఆ తర్వాత రెండు రోజులకు సూరత్‌లోనూ పేలని బాంబులను పోలీసులు గుర్తించి నిర్వీర్యం చేశారు. 2002 నాటి గోధ్రా అల్లర్లకు ప్రతీకారంగానే నిషేధిత ఇండియన్ ముజాహిదీన్, సిమి ఉగ్రవాద సంస్థలు ఈ కుట్ర పన్నినట్లు ప్రాసిక్యూషన్ న్యాయస్థానంలో పక్కా ఆధారాలతో నిరూపించింది. దీంతో దోషులపై దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం (ఉపా – ఖూౠూూ) కింద ఆరోపణలు ఖరారయ్యాయి.

నాడు అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈ కేసులో 100 మందిని నిందితులుగా చేర్చగా, 78 మందిపై విచారణ సాగింది. సుదీర్ఘ ప్రక్రియ అనంతరం 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చింది, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. దర్యాప్తు సమయంలో అప్రూవర్‌గా మారిన ఒకరికి క్షమాభిక్ష లభించగా, తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్లకు కోర్టు శిక్షలు ఖరారు చేసింది. ఈ కేసు విచారణ జరుగుతున్న తరుణంలోనే జైల్లో ఉన్న 24 మంది నిందితులు సుమారు 213 అడుగుల సొరంగం తవ్వి తప్పించుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు ఆ కుట్రను భగ్నం చేశారు. తాజాగా హైకోర్టు తన తీర్పులో శిక్షలను ఖరారు చేయడంతో పాటు, ఈ పేలుళ్లలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షలు, గాయపడిన వారికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందించాలని గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ పరిహార చెల్లింపుల ప్రక్రియను మార్చి 31, 2027 లోగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

## సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గని కేటాయింపు

**మొదటిపేజీ తరువాయి..** పాత్ర పోషించిందని కొనియాడారు. సంస్థను మరింత బలోపేతం చేసేందుకు ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలోనూ సింగరేణి పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఒడిశాలోని 'నైనీ కోల్ బ్లాక్' సింగరేణికి దక్కేలా కేంద్రం చొరవ తీసుకుందని గుర్తుచేశారు. దాదాపు 340 మిలియన్ టన్నుల నిల్వలున్న నైనీ బ్లాక్ నుంచి ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం లభించిందని, దీని ద్వారా రాబోయే 30–35 ఏళ్లలో సింగరేణికి రూ.75 వేల కోట్ల భారీ ఆదాయం సమకూరుతుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## భారీ వర్షాలతో ముంబై జలమయం

**మొదటిపేజీ తరువాయి..** తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాల ప్రభావం రవాణా వ్యవస్థపై తీవ్రంగా పడింది; చాలా వరకు రైలు సర్వీసులు నిలిచిపోగా, వందలాది విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి, కొన్ని రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఏకంగా 600 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా పుణె జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన లోనావాలాలో రికార్డు స్థాయిలో 670 మి.మీ వర్షం కురిసింది. భారీ వర్షాల కారణంగా ముంబై–పుణె మార్గంలోని కర్జత్–లోనావాలా ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడటంతో గత రెండు రోజులుగా ఆ దారిలో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.

పరిస్థితి తీవ్రతను గమనించిన ప్రభుత్వం ముంబై, థానే, పుణె, పాల్ఘర్ జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలకు ముందస్తుగా సెలవులు ప్రకటించింది. భారత వాతావరణ శాఖ (×వీణ) అంచనాల ప్రకారం మహారాష్ట్రలోని కోంకణ్ తీర ప్రాంతంతో పాటు పశ్చిమ కనుమల పరిసరాల్లో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళవారం కూడా ముంబైలో భారీ వర్ష సూచన ఉండటంతో వాతావరణ శాఖ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. నగరం ఇప్పటికే నీట మునిగి ఉన్నందున, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరించారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తూ, బాధితులకు అవసరమైన సహాయక చర్యలను అందిస్తోంది.

## కేరళలో మళ్లీ వర్షాల బీభత్సం

**మొదటిపేజీ తరువాయి..** అక్కడ ఉన్న కొందరు కార్మికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ ఘటనలో ఐదుగురు గాయపడగా, మట్టి కింద మరో 30 మంది వరకు చిక్కుకుని ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రతికూల వాతావరణం, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.

ఈ విపత్తుపై కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ జిల్లా మంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించి, సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. పరిస్థితిని పర్యవేక్షించేందుకు మంత్రులు అనిల్ కుమార్, సిద్ధిక్‌లను వయనాడ్‌కు పంపించారు. ప్రస్తుతం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలు అక్కడ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. ప్రమాద స్థలానికి సమీపంలో నివసిస్తున్న దాదాపు 100 మంది ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొండచరియలు పడటంతో మలప్పురం – వయనాడ్ మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి, అలాగే మీనాక్షి వంతెన వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గత 2024లోనూ వయనాడ్‌లోని ముండక్కై, చూర్‌మాలా ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి 298 మంది మరణించిన భయానక వాతావరణాన్ని ఈ తాజా ఘటన గుర్తు చేస్తోంది. కాగా, కేరళలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేయడంతో, కొండ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని యంత్రాంగం సూచించింది.

## తుంగభద్రకు కొత్త నీరు రాక

### ఎగువన వర్షాలతో మొదలైన ప్రవాహం

**కర్నూలు, జూలై7 :** ఆలస్యమైనా తుంగభద్రకు నీటి రాకడ మొదలైంది. అడుగంటిన తుంగభద్ర జలాశయంలోకి కొత్తనీరు చేరుతోంది. డ్యాం పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా సోమవారం 1550 క్యూసెక్కుల వరద మొదలై.. సాయంత్రానికి 2,159 క్యూసెక్కులకు పెరిగింది. రెండు రోజుల కిందటివరకూ చుక్కనీరు రాకపోవడంతో డ్యాం వెలవెలబోయింది. రైతాంగం, అధికార యంత్రాంగంలో నిస్తేజం అలుముకుంది. ఈ తరుణంలో నైరుతి రుతుపవనాలు కరుణించాయి. కర్ణాటకలోని మలెనాడు, తుంగభద్ర ఎగువ పరివాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తుంగ, భద్ర నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. తుంగ జలాశయం నిండటంతో పదిగేట్లను ఎత్తి 18 వేల క్యూసెక్కుల నీటిని సోమవారం దిగువకు విడుదల చేశారు. అక్కడి నుంచి తుంగభద్ర జలాశయానికి వరద నీరు చేరేందుకు సుమారు 310 కి.మీ. ప్రయాణించాల్సి ఉంటుంది. మరో రెండురోజుల్లో ఆ నీటి చేరికతో వరద పెరగనుంది. భద్ర జలాశయం కూడా నిండితే, వరద మరింత పెరుగుతుంది. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో 1587.92 అడుగుల వద్ద 9.379 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి జలాశయంలో 77.343 టీఎంసీల నీరు ఉన్నింది. తుంగభద్ర డ్యాంకు వరద ఆలస్యం కావడం ఇదే మొదటిసారి కాదు. 2002-03, 2003-04, 2004-05, 2016-17, 2023-24 నీటి సంవత్సరాల్లోనూ వరద ఆలస్యమైంది. కొన్నిసార్లు జూలై రెండోవారంలోనూ వదర మొదలైంది. జూలై, ఆగస్టు నెలల్లోనూ వర్షాభావ పరిస్థితుల కారణంగా చెప్పుకోదగ్గ వరద రాలేదు. డెడ్ స్టోరేజీకి పడిపోయిన సందర్భాలూ ఉన్నాయి.

# ప్రత్యేక సమగ్ర సవరణ దరఖాస్తులను తప్పులు లేకుండా నింపాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 7(జన సంఘర్షణ)

మెదక్ జిల్లాలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై మంగళవారం జిల్లా అధికారుల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..జిల్లాలోని 34-మెదక్, 37-నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలలో మొత్తం 586 మంది బూత్ లెవల్ అధికారులు (బి ఎల్ ఓ లు) నియమించబడగా, వారందరికీ శిక్షణ పూర్తయిందని తెలిపారు. జిల్లాలోని మొత్తం 4,53,140 మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌లు పూర్తిగా డౌన్‌లోడ్ చేసి పంపిణీ ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 4,38,409 ఫారమ్‌లు (96.75 శాతం) పంపిణీ చేయగా, 45,663 ఫారమ్‌లు (10.08 శాతం) డిజిటలైజ్ చేయబడ్డాయని





తెలిపారు. ఇప్పటివరకు 21,092 మంది ఓటర్లు స్వయంగా వివరాలను నమోదు చేసుకోగా, 23,217 మంది ద్వారా వివరాలను సమర్పించారు. కేవలం 580 కేసుల్లో మాత్రమే పెండింగ్లో ఉందని అధికారులు తెలిపారు. అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ఇంకా ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించని అర్హులైన ఓటర్లు వెంటనే తమ పరిధిలోని బి ఎల్ ఓ ను సంప్రదించి ఫారమ్‌లు పూర్తి చేసి అందజేయాలని కోరారు. సరైన వివరాలతో ఫారమ్‌లు సమర్పించడం ద్వారా ఓటరు జాబితా మరింత పారదర్శకంగా,ఖచ్చితంగా రూపొందుతుందని పేర్కొన్నారు.జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటర్లకు అవసరమైన సహాయం అందిస్తోందని, ప్రజలందరూ ఈ కార్యక్రమానికి సహకరించి తమ ఓటు హక్కును పరిరక్షించు కోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, ఎలక్షన్ సూపరిండెంట్ గఫార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి వంటి మాదకద్రవ్యాల కట్టడికి పటిష్టమైన నిఘా

- మత్తు పదార్థాలను నిర్మూలించాలి.
- మద్యం విక్రయ కేంద్రాల పరిసరాల్లో ఆరోగ్యకర వాతావరణం కల్పించాలి.
- టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా విస్తృత తనిఖీలు చేపట్టాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 7(జన సంఘర్షణ)

గంజాయి వంటి మాదకద్రవ్యాల కట్టడికి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తూ మత్తు పదార్థాలను నిర్మూలించుటకు తెలంగాణ ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎక్సైజ్ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మత్తు పదార్థాలు పూర్తిగా నిర్మూలించాలన్నారు. మత్తు పదార్థాల నియంత్రణపై పాఠశాలలు, కళాశాలలో





అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలు, 5 బార్లు కు 2024-2025 వ సంవత్సరానికి 574.08 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చిందని, 2025 వ సంవత్సరానికి 410. 44 కోట్ల రూపాయలు ఆదాయం సమకూరిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మత్తు పదార్థాలపై కఠినంగా వ్యవహరిస్తామని, పాఠశాలలో ,కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు నాగేశ్వరరావు, నరేందర్, సలాం ముస్తఫా, మాన్ సింగ్, రాజేష్, రామచందర్, ఖాజా ఆహమ్మద్, అరుణ, విజయ్ సిద్దార్థ, హరీష్ లు పాల్గొన్నారు.

# పోతంగల్ మండల కేంద్రంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ వేడుకలు

పోతంగల్/ జూలై 7/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణం వద్ద మంగళవారం జెండాను ఎగురవేసి ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ వేడుకలు పోతంగల్ మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎర్రోళ్ల యాదవరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు యాదవరావు మాట్లాడుతూ.. సమాజ హితమే ఎమ్మార్పీఎస్ ఉద్యమ తత్వమని గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధించి ఆ విజయ ఫలాలను మాదిగ, మాదిగ ఉపకులాలకు అందించి రేపటి తరాల భవిష్యత్తుకు చెరగని చరిత్రను నిర్మించిన ఘనత మందకృష్ణ మాదిగదని సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతల లేని నూతన సమాజ నిర్మాణం కాంక్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం తన ప్రయాణాన్ని కొనసాగిస్తుందని అన్నారు. మాదిగ సమాజానికి దక్కవలిసిన రిజర్వేషన్ హక్కుల కోసం పోరాడుతూనే మరోవైపు నిరాదరణకు గురైన వర్గాలైన వికలాంగుల వృద్ధులు వితంతువుల కోసం పోరాడి వారికి పెన్షన్లు సాధించడం జరిగింది. గుండె జబ్బుల చిన్నారులకు ఉచిత ఆపరేషన్లు, ఆరోగ్యశ్రీ పథకం, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు, తెలంగాణ అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు, మహిళ భద్రత కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, తెల్ల రేషన్ కార్డు ప్రజలకు 6 కిలోల బియ్యం పెంపు మొదలగు ఫలితాలను ఎమ్మార్పీఎస్ సాధించిందని అన్నారు. ఈ ఫలాలు కేవలం మాదిగల కోసం చేసినవి కావని, అన్ని వర్గాల సంక్షేమం సామాజిక బాధ్యతతో చేసిన ఉద్యమాలని అన్నారు. కాబట్టి సమాజ హితమే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ పోరాడుతుందని అన్ని వర్గాల ప్రజలు గుర్తించాలని అన్నారు. మాదిగల కోసం ముప్పై ఏళ్లుగా జరిగిన రాజీలేని పోరాటం విజయవంతమై తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు జరుగుతుందని అన్నారు. ఈ విజయానికి కారణం ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు అందించిన సహకారమే అని అన్నారు. దేశంలో ఎన్నో కుల ఉద్యమాలు పుట్టినప్పటికీ లక్ష్యం సాధించే వరకు ఏ ఉద్యమం నిలబడలేకపోయాయి కాని ఎమ్మార్పీఎస్ మాత్రమే సజీవంగా నిలబడి లక్ష్యం చేరిందని దానికి



సమాజం ఇచ్చిన సహకారమే ప్రధాన కారణమని అన్నారు. పోరాటాల ద్వారా సమాజానికి సంక్షేమ ఫలాలు అందించిన మన అధినేత మందకృష్ణ మాదిగ జన్మదిన శుభాకాంక్షలు ఘనంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతంగల్ ఉమ్మడి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు, గ్రామ సర్పంచ్ బజరంగ్ హనుమండ్లు, బి జె పి నాయకులు పబ్బ శేఖర్, రిటైర్ ఉద్యోగి నాగయ్య సార్, తిరుమలాపూర్ సర్పంచ్ కుమారుడు విజయ్, పోతంగల్ మండలం ఎమ్మార్పీఎస్ కమిటీ సభ్యులు, ఈరయ్య, సంగరం, వెంకటి, హరిదాస్, లింగం, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 7 (జన సంఘర్షణ)

జిల్లాలో వ్యవసాయ కార్యకలాపాలపై కలెక్టర్ సమీక్ష జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ సన్నాహాలు, రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్ల సరఫరా, ప్రభుత్వ రైతు సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్ నేడు సమీక్ష సమావేశం





నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంటల సాగు పురోగతి, వర్షపాతం పరిస్థితులు, నీటి లభ్యత, ఎరువుల నిల్వలు, పంటలలో తెగుళ్లు, కీటకాల నివారణ చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ రైతులకు శాస్త్రీయ సాగు విధానాలు, సమతుల్య ఎరువుల వినియోగం, నేల పరీక్షలు, సూక్ష్మపోషకాల వినియోగం, నీటి యాజమాన్యంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సంయుక్త వ్యవసాయ సంచాలకులు, జిల్లా వ్యవసాయ అధికారి, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు,అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 7(జన సంఘర్షణ)



నెలవారీ తనిఖీ షెడ్యూల్‌లో భాగంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఈవీఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, ప్రవేశ నియంత్రణ చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే గోదాం వద్ద అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణను పర్యవేక్షించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా భారత ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ తనిఖీలో ఎన్నికల విభాగ అధికారులు, సంబంధిత సిబ్బంది, పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల ఆందోళనలతో దద్దరిల్లిన కలెక్టరేట్

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 7(జన సంఘర్షణ)



బెస్ట్ అవైలబుల్ విద్యార్థుల్ని పాఠశాలకు రానివ్వకుండా యాజమాన్యాలు వెళ్లగొడుతున్నాయని గత రెండు రోజులుగా కలెక్టరేట్ పడిగాపులు పడుతున్నారు. ఈ విషయమై మంగళవారం జిల్లా కలెక్టర్ వాహనాన్ని అడ్డుకున్నారు. నినాదాలు చేశారు. బయటకు వెళ్ళనీకుండా అడ్డుకున్నారు చేసేది లేక కలెక్టర్ కారు దిగి చాంబర్లోకి తెల్లగా కలెక్టర్‌ను వెంబడించి సాంబార్ ముందు బయట నుంచి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమస్య పరిష్కరించాకే బయటకు వెళ్లాలంటూ ఆందోళన చేపట్టారు విషయం తెలుసుకున్న మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ సంఘటన స్థలం చేరుకొని విద్యార్థులను తల్లిదండ్రులకు నచ్చ చెప్పారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆందోళన విరమించాలంటూ వారిని సముదాయించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. మా పిల్లల భవిష్యత్తు ఆగమవుతుందని వారికోసం తిరుగుతుంటే మా ఉపాధి కూడా కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు . తక్షణమే మాకు న్యాయం చేయాలంటూ డిఎస్పిని వేడుకున్నారు సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని డిఎస్పి వారికి హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు శాంతించారు. అనంతరం వారిని అక్కడినుండి బయటకు తీసుకువచ్చారు. దీంతో కలెక్టర్ ఛాంబర్ లోంచి బయటకు వచ్చి క్యాంపు కార్యాలయానికి వాహనంలో తరలి వెళ్లారు.

# చెత్తని వేరు చేయడంపై అవగాహన కార్యక్రమం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 7(జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ని 1వ వార్డులో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా చెత్తను ఎలా వేరు చేయవలెనని అవగాహన కార్యాక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో చైర్మన్, కమీషనర్ మాట్లాడుతూ.. చెత్తను 4 రకాలుగా వేరుచేయవలెనని, 1 తడి చెత్త, 2 పొడి చెత్త 3 డైపర్స్, పాడ్స్ 4 పగిలిపోయిన లైట్స్, ట్యూబ్లైట్స్ ఈ టీ సి రకాలుగా వేరుచేయవలెనని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు, కమీషనర్ రవీందర్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ వనిత, కౌన్సిలర్స్ గుగులోత్ రవి, దేవుని రంజిత్, డి సి సి ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, డి సి సి కార్యదర్శి పోచమ్మల గణేష్, మాజీ కౌన్సిలర్ అనిల్, మోబిన్, సీనియర్ నాయకులు బొట్ల బాబు, గావు భాస్కర్, బైరం శంకర్ ఊర సత్యం శివ కుమార్ అసది రాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు చిలుక విరాట్, భాను ప్రసాద్ నరేష్ నితిన్, సుధీర్, గణేష్, నరేందర్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్-44పై నిఘా మరింత పటిష్ఠం

- తూప్రాన్ టోల్‌గేట్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేసిన అదనపు ఎస్పీ.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 7(జన సంఘర్షణ)



జాతీయ రహదారి-44పై భద్రతా పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సూచించారు. మంగళవారం తూప్రాన్ టోల్‌గేట్ వద్ద ఉన్న కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించి సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఎన్‌హెచ్-44పై వాహనాల రాకపోకలను నిరంతరం పర్యవేక్షిస్తూ అనుమానాస్పద వాహనాలు, వ్యక్తుల కదలికలను వెంటనే గుర్తించి సంబంధిత పోలీసు స్టేషన్లకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలు ఎల్లప్పుడూ పనిచేసే స్థితిలో ఉండేలా నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ సందర్భంగా కంట్రోల్ రూమ్‌లో అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది తీసుకునే చర్యలు, సమాచార సేకరణ, స్థానిక పోలీసు స్టేషన్లతో సమన్వయం, స్పందించే విధానాన్ని అదనపు ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సమయంలో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు రహదారి భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని అదనపు ఎస్పీ పేర్కొన్నారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ వెంట తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎస్ఐ గంగరాజు, సిబ్బంది ఉన్నారు.



# ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

కోటగిరి../జూలై 7/( జన సంఘర్షణ)



కోటగిరి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 35వ ఎంఆర్పిఎస్ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు ఘనంగానే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, సర్పంచ్ బర్ల మధు, నిజామాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి పోచీరం, కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. హనుమంతు మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకం రావడానికి మందకృష్ణ మాదిగ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. మందకృష్ణ మాదిగ కీలకపాత్ర నిర్వహించారు. దేశంలో గౌరవించే మందకృష్ణ అన్నకి పద్మశ్రీ అవార్డు రావడం గర్వకారణం అని తెలిపారు.

జన సంఘర్షణ
తెలుగు దినపత్రిక
బుధవారం
08 జులై 2026

# మాట ఇచ్చి... నిలబెట్టిన నాయకుడు

- సుల్తాన్ నగర్‌కు 24 గంటల టౌన్ విద్యుత్ సరఫరా ప్రారంభం! కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్

నిజాంసాగర్:/జులై 7/( జనసంఘర్షణ)

నిజాంసాగర్: నిజాంసాగర్ మండల కేంద్రానికి చెందిన సుల్తాన్ నగర్ గ్రామ ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న 24 గంటల టౌన్ విద్యుత్ సరఫరా కల సాకారమైంది. గ్రామానికి టౌన్ విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు పూర్తికావడంతో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ గ్రామానికి చేరుకుని కొబ్బరికాయ కొట్టి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఇటీవల గ్రామ సర్పంచ్ వడ్ల బ్రహ్మం సుల్తాన్ నగర్ గ్రామంలో మిక్స్‌డ్ ఫీడర్ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి గ్రామానికి 24 గంటల టౌన్ విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ప్రత్యేక చొరవతో అధికారులు వేగంగా స్పందించి అవసరమైన పనులను పూర్తిచేయడంతో, ఈరోజు సుల్తాన్ నగర్ గ్రామానికి అధికారికంగా 24 గంటల టౌన్ విద్యుత్ సరఫరా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏలే మల్లికార్జున్ కొబ్బరికాయ కొట్టి విద్యుత్ సరఫరాను ప్రారంభించి గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన ప్రతి అంశంపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సేవలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు.




ఈ సందర్భంగా సుల్తాన్ నగర్ గ్రామ ప్రజలు, గ్రామ సర్పంచ్ వడ్ల బ్రహ్మం తమ సమస్యను వెంటనే పరిష్కరించి 24 గంటల విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకొచ్చిన కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# తాడ్కోల్ రోడ్డులో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

- ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం

బాన్సువాడ, /జులై 7: /(జనసంఘర్షణ)

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని తాడుకోల్ రోడ్డులో ఎన్నో ఏళ్లుగా ప్రజలను వేధిస్తున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ చర్యలు ప్రారంభించారు. మంగళవారం తాడ్కోల్ రోడ్డులో పాత డ్రైనేజీపై నిర్మించిన కల్వర్టులు, స్లాబ్‌ల తొలగింపు పనులకు ఆయన స్వయంగా శ్రీకారం చుట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన డ్రైనేజీలను వ్యాపార సంస్థలు మూసివేయడం, వాటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల మురికినీరు సక్రమంగా ప్రవహించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులతో కలిసి ఆక్రమణలకు గురైన డ్రైనేజీలు, కల్వర్టులను తొలగించి మురికినీటి పారుదల సజావుగా జరిగేలా చర్యలు




చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు వేగంగా పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలకు, వ్యాపారులకు ఆయన ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ సంచులు, ఇతర వ్యర్థాలను మురికి కాలువల్లో వేయకుండా, మున్సిపల్ ట్రాక్టర్ల ద్వారా సక్రమంగా చెత్తను అప్పగించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే పట్టణాన్ని పరిశుభ్రంగా, సమస్యల రహితంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గత సంవత్సరం బాన్సువాడలోని స్టేట్ బ్యాంక్ సమీపంలో ప్రధాన రహదారి కింద మూసుకుపోయిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని స్వయంగా పర్యవేక్షిస్తూ వారం రోజుల పాటు ప్రత్యేక చర్యలు తీసుకుని పూర్తిస్థాయిలో శుభ్రం చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ చర్యలతో ఆ ప్రాంత ప్రజలు ఉపశమనం పొందినట్లు తెలిపారు. అదే సంకల్పంతో తాడ్కోల్ రోడ్డులో కూడా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని కాసుల బాలరాజ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ కౌన్సిలర్ ఖలేఖ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేశారు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 7 (జన సంఘర్షణ)




ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ సందర్భంగా జెండా కార్యక్రమంలో పాల్గొన్నవారు. రామాయంపేట మండల అధ్యక్షులు ఎర్ర నరేష్ మాదిగ, సీనియర్ నాయకులు బండామీది సాలమన్ మాదిగ, విహెచ్ పిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు గంగాపురం సంజీవులు మాదిగ, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు మానెగళ్ళ రామకృష్ణయ్య, వార్డు మెంబర్ బండమీది రాజు, సీనియర్ నాయకులు చిన్నస్వామి, ఎర్రబాబు, సుమన్ ప్రసాద్, రాజు కుమార్, బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోధన్/జులై 7/( జనసంఘర్షణ)




విద్యుత్ శాఖ అభివృద్ధి పనుల కారణంగా బుధవారం 11 కేవీ ఎక్స్‌ప్రెస్ ఫీడర్ నిర్వహణ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ కటింగ్) చేయడం జరుగుతుందని ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. అచన్పల్లి, వినాయక్ నగర్, ఆటోనగర్, రుద్ర గ్రీన్లాండ్స్, పెగడపల్లి రోడ్డు పరిసర కాలనీల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

## అయోధ్య' విరాళాల స్కామ్కు కాంగ్రెసే కారణం..

- మహిళ వీడియో వైరల్


యూపీ/జులై 7/( జనసంఘర్షణ)



అయోధ్య రామ మందిరంలో డొనేషన్ స్కామ్కు కాంగ్రెస్ పార్టీనే కారణమంటూ ఓ మహిళ మాట్లాడిన వీడియో వైరలవుతోంది. యూపీలో బీజేపీ అధికారంలో ఉందని జర్నలిస్టు చెప్పగా, ఇక్కడ అయోధ్యలో కాంగ్రెస్ ఉందని ఆమె తడబడకుండా చెప్పేశారు. మిగతా వాళ్లు ఆమెకు సపోర్టు చేశారు. వాస్తవానికి అయోధ్య ఎమ్మెల్యే బీజేపీ నేత వేద్ ప్రకాశ్ గుప్తా. ఇక అయోధ్య అసెంబ్లీ స్థానం ఉన్న ఫైజాబాద్ ఎంపీ అవధేశ్ ప్రసాద్ సమాజ్వాదీ పార్టీ. ఆమె వ్యాఖ్యలపై మీ సంప్రదించింది.

# రాయికూర్ బ్రిడ్జి మట్టి రోడ్డు వేశారు



రుద్రూర్/జులై 7/(జన సంఘర్షణ)

రుద్రూర్ మండలంలోని రాయికూర్ గ్రామంలో నుండి బోధన్ వెళ్లేదారిలో బ్రిడ్జి పనులు దాదాపు 8 సంవత్సరాలు నుంచి నింపియడం జరిగింది. (జన సంఘర్షణ) న్యూస్‌లో రావడం వలన ఎఫెక్ట్‌తో మొరం రోడ్డు వేయడం జరిగింది.

# సంగమేశ్వర కాలనీలో డంపింగ్ యార్డ్

- కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం

బాన్సువాడ/జులై 7/( జనసంఘర్షణ)



కామారెడ్డి జిల్లా, బాన్సు వాడ పట్టణంలోని సంగ మేశ్వర కాలనీని మున్సిపాలిటీ మరో డంపింగ్ యార్డ్ మారుస్తోందని, పట్టణ ంలోని డ్రైనేజీ చెత్తాచెదారాన్ని అక్కడికి తరలిస్తున్నారని కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యర్థాలను తక్షణమే తొలగించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని మున్సిపల్ అధికారులను, ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు.

# మల్లూరి శ్రీనివాస్ అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 7(జన సంఘర్షణ)



మెదక్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మల్లూరి. జగదీష్ తండ్రి మల్లూరి శ్రీనివాస్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా, మంగళవారం నిర్వహించిన అంత్యక్రియల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ కుమారులు జగదీష్, నగేష్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాస్ మృతి బాధాకరమని పేర్కొంటూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. వీరి వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ దీపక్ కుమార్, మాజీ కౌన్సిలర్లు ఆర్కే. శ్రీనివాస్, కేవల్ జగదీష్, నాయకులు లింగారెడ్డి, కృష్ణగౌడ్, ప్రభు రెడ్డి, ప్రభు గౌడ్, హరి తదితరులు ఉన్నారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- యాంటీ ర్యాగింగ్ కమిటీలను సమర్థవంతంగా నిర్వహించాలి.
- నూతన విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలి.
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 7(జన సంఘర్షణ)




కళాశాలలు, హాస్టళ్లు ప్రారంభమైన నేపథ్యంలో నూతనంగా చేరిన విద్యార్థుల పట్ల సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా, గౌరవప్రదంగావ్యవహరించాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. ర్యాగింగ్ అనేది చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు ఎలాంటి అవకాశం లేకుండా యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి కట్టుగా పనిచేయాలని తెలిపారు. నూతన విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం, అవమానించడం, శారీరక లేదా మానసిక వేధింపులకు పాల్పడడం వంటి చర్యలు చట్టరీత్యా కఠిన చర్యలకు దారితీస్తాయని హెచ్చరించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. హాస్టళ్లలో వార్డెన్లు ప్రత్యేక నిఘా ఉంచి విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ర్యాగింగ్ దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించి, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే కళాశాల యాజమాన్యానికి లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మెదక్ జిల్లా పోలీసు శాఖ విద్యాసంస్థల పరిసరాల్లో ప్రత్యేక నిఘాకొనసాగిస్తుందని, ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. విద్యార్థులు ఎలాంటి సమస్య ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, వారి భద్రతకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

# జిల్లా కలెక్టర్ సంక్షేమ హాస్టల్‌ను పర్యవేక్షణ చేయాలి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 7 (జన సంఘర్షణ)




జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ బీసీ, ఎస్సీ,ఎస్టీ హాస్టల్ లను పర్యవేక్షణ చెయ్యాలని యు ఎస్ఎఫ్ ఐ మెదక్ జిల్లా అధ్యక్షులు జగన్ ఒక్క ప్రకటనలో తెలిపారు. జిల్లాలో హాస్టలలో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా చాలా సమస్యలతో పరిమితమవుతున్నాయని యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు జగన్ అన్నారు. పది రోజుల పాటు అన్నీ హాస్టలను పర్యవేక్షణ చేయడం జరిగిందని ఇంటర్ జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యలు తెలుసుకొని జగన్ మాట్లాడుతూ.. బీసీ హాస్టళ్ల పరిస్థితి దారుణంగా ఉందని వంద మంది వుంటే మూడు బాత్ రూములు వున్నాయని చెప్పారు విద్యార్థులు చాలా ఇబ్బంది ఎదురు కుట్టున్నారని ఆయన అన్నారు. ఎస్సీ ఎస్టీ హాస్టల్ మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఉదయం రాగిజావ కూడా పెట్టడం లేదని ఆయన మండిపడ్డారు విపరీతమైన దోమలు కరుస్తున్న వార్డెన్ లు పట్టించుకోవడంలేదని ఇప్పటివరకు కూడా దోమతెరలు లేనటువంటి హాస్టళు ు ఉన్నాయని ఆయన మండిపడ్డారు. అపరిశుభ్రంగా హాస్టల్ లో వెలబోతున్నాయని ఇంత జరుగుతున్న జిల్లా వేల్పల్స్ మాత్రం కుర్చీలకే పరిమితం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు కేజీబీవీ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.గురుకలలో నీళ్ల చారుతో సరిపెడుతున్నారని అన్నారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులకు భోజనం అమలు చేయాలని తక్షణమే కలెక్టర్ హాస్టళ్లను సుడిగాలి పర్యటనగా చేసి సమస్యలు పరిష్కరం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యుఎస్ఎఫ్ఐ మెదక్ నగర కార్యదర్శి చరణ్ నాయకులు రాజు, అర్జున్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని విజయవంతం చేయండి

- రామాయంపేట పట్టణ అధ్యక్షుడు చింతల స్వప్న స్వామి కోరారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 7 (జన సంఘర్షణ)



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి జయంతి సందర్భంగా మెదక్ రోడ్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగును. రామాయంపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాంకాళి దేవాలయం డైరెక్టర్లు, ప్రతి వాడు కాంగ్రెస్ కార్యకర్తలు , నాయకులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు అందరూ హాజరుకావాలని కోరుతున్నాం. ఈ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని కోరుచున్నాము

## గుమ్మడి ఫౌండేషన్, అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేసిన శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి



కోటగిరి/జులై 7 /(జనసంఘర్షణ)
కోటగిరి మండల కేంద్రంలోని ఎక్లాస్పూర్ శివారులో ఉన్న గుమ్మడి ఫౌండేషను శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి (సిడిపిఓ ) నందిని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ లో ఉన్న అనాథ చిన్నారులకు కల్పిస్తున్న వసతులు, సంరక్షణ, పోషకాహార ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం కోటగిరి మండల కేంద్రంలోని బీసీ కాలనీ, మాలివాడి అంగన్ వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. చిన్నారులకు అందుతున్న పోషకాహారం, ప్రాథమిక సేవలు, రికార్డుల నిర్వహణను పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని అంగన్వాడి కార్యకర్తలకు సూచించారు. ఈ పర్యటనలో సమగ్ర శిశు అభివృద్ధి సేవల (ఐసిడిఎస్) పర్యవేక్షకురాలు భవాని కొమురవ్వ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కేటీఆర్ తనయుడు హిమాన్షు ఆస్పత్రిలో పరామర్శించిన కెసిఆర్




గచ్చిబౌలి/జులై 7/( జన సంఘర్షణ)
మాజీ మంత్రి కేటీఆర్ తనయుడు హిమాన్షు గాయపడ్డారు. సోమవారం గేమ్స్ ఆడుతుండగా హిమాన్షు స్వల్పంగా గాయపడడంతో ఆయన్ను గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్కు తరలించారు. ఆయన్ను పరీక్షించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం హిమాన్షు హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. అయితే విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్రావు హాస్పిటల్కు చేరుకున్నారు. అలాగే కేసీఆర్ సైతం ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి హాస్పిటల్కు వెళ్లి మనవడిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు.అయితే ఈ ప్రమాదంపై కేటీఆర్ తనయుడు హిమాన్షు సైతం స్పందించాడు. ఈ ఘటనపై ఎక్స్ వేదికగా పోస్ట్ చేశాడు హిమాన్షు. సోమవారం రాత్రి చిన్నపాటి గాయం కారణంగా హాస్పిటల్లో చేర్చారని హిమాన్షు తెలిపాడు. గాయం నుంచి కోలుకునేందుకు కాస్త సమయం పడుతుందని.. అంతవరకు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు హిమాన్షు తెలిపాడు. అలాగే ప్రస్తుతం తన ఆరోగ్యం బాగానే ఉందని హిమాన్షు పేర్కొన్నాడు.

## ట్రాక్టర్ ఢీకొన్న ఆర్టీసీ బస్సు పలువురు గాయాలు

జన సంఘర్షణ 7-7-2026








భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నారావారి గూడెం నుండి అశ్వరావుపేట వైపుకుఎరువు లోడుతో వస్తున్న ట్రాక్టర్ను విజయవాడ నుండి అశ్వరావుపేట వస్తున్న సత్తుపల్లి డిపోకు చెందిన TS 04 UE1569 గల బస్సు వెనక నుండి ఢీకొడంతో పలువురికి గాయాలు కాగా ట్రాక్టర్ డ్రైవర్ కన్నయ్య పరిస్థితి విషయంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఆంధ్ర ప్రదేశ్ ఏలూరు హాస్పటల్కు తరలించారు అతివేగం మే కారణం అంటున్న స్థానికులు మరి కొంతమంది గాయాలు అయినా వారి నీ అశ్వరావుపేట గవర్నమెంట్ హాస్పిటల్ చికిత్స అందించారు. వారి వివరాలు ఎర్రగుంటపల్లి చెందిన శ్రావణి, చరణ్ రాజ్, బిందు శ్రీ, అశ్వరావుపేట చెందిన ప్రసన్న లక్ష్మి , కృష్ణకుమారి, రమాదేవి, బోనాల సునీత, కౌలూరి శ్యామల, జక్కంరామలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్ వారు ట్రాఫిక్ క్లియర్ చేసి కేసుదర్యాప్తు చేస్తున్నారు.

## మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సుజాత





బోధన్/జూలై 7/( జనసంఘర్షణ
నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో గౌరవ పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదినం సంద ర్భంగా మంగళవారం విహెచ్పి ఎస్ సంఘం జాతీయ అధ్యక్షు రాలు సుజాత సూర్యవంశీ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ వికలాంగులకు చేసిన సేవ లను గుర్తు చేసుకున్నారు. దివ్యాంగుల తరఫున ఇంత సేవ చేస్తున్న ఆయన నిండు నూరేళ్లు జీవించాలని పేర్కొ న్నారు. ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపు కోవాలని ఆమె ఆకాంక్షిం చారు. మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ స్థాపించి ఇప్పటికీ 32 సంవత్సరాలు గడిచాయని, ఆయన చేసిన సేవలు, త్యాగాలు అమూల్య మైనవని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా విద్యుత్ కోతలు.. సింగరేణి మండల ప్రజల సహనానికి పరీక్ష

◆ కరెంట్ లేక చిన్నారుల చదువులకు ఆటంకం..
◆ అప్రకటిత కోతలపై ప్రజల ఆగ్రహం

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ)
సింగరేణి మండలంలో కొనసాగుతున్న అప్రకటిత విద్యుత్ కోతలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ అంతరాయాలతో గ్రామాల్లో ప్రజల సాధారణ జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు అత్యధికంగా నష్టపోతున్నారు. రాత్రి వేళల్లో కరెంట్ లేకపోవడంతో చిన్నారులు చదువుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరీక్షలు, హోంవర్క్లు పూర్తి చేయడంలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉక్కపోత వాతావరణంలో చిన్నపిల్లలు, వృద్ధులు నిద్రలేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ కోతల ప్రభావం తాగునీటి సరఫరాపై కూడా పడుతోంది. మోటార్లు పనిచేయక గ్రామాల్లో నీటి సమస్య తలెత్తుతోంది. చిన్న వ్యాపారులు, దుకాణదారులు, రైతులు సైతం విద్యుత్ అంతరాయాలతో నష్టపోతున్నారు. తరచూ కరెంట్ పోవడంతో విద్యుత్ పరికరాలు దెబ్బతింటాయనే భయం కూడా ప్రజల్లో నెలకొంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలను నిలిపివేయాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తు, ప్రజల అవసరాలను గుర్తించి విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మండల



వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఈనాటి పిల్లలకు సరైన పౌష్టికాహారం, నాణ్యమైన విద్యను అందించే విషయంలో ప్రజా ప్రభుత్వం స్పష్టమైన బాధ్యతతో ముందుకు వెళుతుంది

◆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

మహబూబ్నగర్/ జూలై7/(జన సంఘర్షణ)
ఈనాటి పిల్లలకు సరైన పౌష్టికాహారం, నాణ్యమైన విద్యను అందించే విషయంలో ప్రజా ప్రభుత్వం స్పష్టమైన బాధ్యతతో పలు కార్యక్రమాలు ప్రారంభించిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. పిల్లలకు సరైన పౌష్టికాహారం, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన తెలంగాణ, ప్రయోజకులైన దేశ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. హైదరాబాద్ నాచారం ఐడీఏ ప్రాంతంలో తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బాలామృతం కొత్త ప్లాంటును ముఖ్యమంత్రి ప్రారంభించారు.







అనంతరం బాలామృతం ఉత్పత్తి, ప్యాకింగ్ ప్రాసెస్ యూనిట్ను పరిశీలించారు. పరిసరాల్లో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్తు, వారికి నాణ్యమైన విద్యను అందించడానికి ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టడమే కాకుండా వారికి పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా ఉండాలి. పిల్లలు ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే తల్లిదండ్రుల్లో ఆనందం ఉంటుంది. తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు ఆరు సంవత్సరాల వరకు బలవర్ధకమైన పోషకాహారం పేద పిల్లలకు ఇవ్వాలనే ఈ నూతన బాలామృతం ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించాం. పిల్లలు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే, ఇలాంటి సంస్థలు రావాలి. ప్రభుత్వం వైపు నుండి అన్ని విధాల సహకారం అందిస్తాం. పిల్లల భవిష్యత్తే, తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు. పేద పిల్లల ఆరోగ్యం, చదువు పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. పిల్లలకు నాణ్యమైన భోజనమే కాకుండా నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు. అని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు. గతంలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ మహబూబ్నగర్ లో ఈ కేంద్రాన్ని ప్రారంభించగా, అంచెలంచెలుగా ఇక్కడ 21 ఎకరాల్లో పెద్ద పరిశ్రమగా విస్తరించిందని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లతో పాటు మరో నాలుగైదు రాష్ట్రాలకు పౌష్టికాహారం అందించే సామర్థ్యం సాధించిందన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ విధానం లేదు. పట్టణాల్లో వలస వచ్చిన వారి పిల్లలు చదువుకోవాలంటే, ప్రైవేటు స్కూళ్లకు పంపిస్తున్నారు. పేదలు తాము సంపాదించిందంతా పిల్లల చదువు కోసం ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. పేదల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వ బడుల్లో నర్సరీ నుండి 12వ తరగతి వరకు బ్రేక్ఫాస్ట్, లంచ్, సాయంత్రం స్నాక్స్ అందించే కార్యక్రమం ప్రారంభించాం. విద్య రంగంపై ప్రతి ఏటా రూ. 27 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఈ ఖర్చును ఖర్చుగా భావించడం లేదని భవిష్యత్తును తీర్చిదిద్దే పెట్టుబడిగా భావిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలన్నీ ఆడబిడ్డల పేరిటే ఇస్తున్నామని వాటి వివరాలను తెలిపారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘాలకు రుణాలు, వెయ్యి మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, పెట్రోల్ బంకులు, అద్దె ప్రాతిపదికన ఆర్టీసీకి ఇవ్వడానికి వెయ్యి బస్సులు, శిల్పారామం వద్ద మూడున్నర ఎకరాల స్థలంలో ఇందిరా మహిళా శక్తి కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా క్యాంటీన్లు వంటి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్ నగరంలో భూముల ధరలు వజ్రాల ధర పలుకుతున్న పరిస్థితుల్లో నిరుపేదల కోసం లక్ష ఇండ్లు కట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు వ్యాపార రంగంలో విస్తరించడానికి అన్ని రకాల ప్రణాళికలతో ముందుకు వెళుతామని చెప్పారు.


## చేయూత పింఛను లబ్ధిదారుల ద్వారా బలవంతంగా పోస్టల్ ఖాతాలను తీయించకూడదు

◆ డిఆర్డిఏ పిడి హెచ్చరిక

కామారెడ్డి బ్యూరో/జులై 7 (జనసంఘర్షణ)
కామారెడ్డి జిల్లాలోని 22 మండలాలలో ప్రభుత్వం ద్వారా అందచేస్తున్న చేయూత పింఛనులను, పోస్టల్ సిబ్బంది ద్వారా గ్రామీణ ప్రాంతములలో పంపిణీ చేయడం జరుగుతుంది. ఇట్టి పంపిణీ సందర్భంగా కొన్ని గ్రామాలలో పోస్టల్ సిబ్బంది బలవంతంగా తప్పని సరిగా పోస్టల్ ఖాతా తెరవాలని బలవంతపెడుతున్నట్లు కొందరి లబ్ధిదారుల నుండి జిల్లా కార్యలాయానికి ఫోన్ కాల్స్ రావడం పలు దిన పత్రికలో ప్రచురితం కావడం జరిగింది. సందర్భంగా పింఛను లబ్దిదారులకు తెలియ చేయడం ఏమనగా చేయూత పింఛనులు పొందడానికి ప్రస్తుతం ఉన్నటువంటి నిబంధనల ప్రకారం ,ఎలాంటి పోస్టల్ ఖాతా అవసరం లేదు. కావున పోస్టల్ సిబ్బంది ఎవరు కూడా పింఛను లబ్దిదారుల ద్వారా ఎలాంటి ఖాతాను తెరవమని బలవంతం చేయరాదని, ఇక పై ఎక్కడైనా ఇలాంటి సంఘటనలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే అట్టి సిబ్బంది పై కఠినచర్యలు తీసుకోవలసిందిగా పోస్టల్ అధికారులకు సిఫారసు చేస్తామని , పింఛను లబ్దిదారులు ఎలాంటి పుకార్లను నమ్మకూడదని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి తెలపడం జరిగింది.




## మార్కెట్ వెళ్లి అదృశ్యమైన చిన్నారి..



◆ పోలీసుల ముమ్మర గాలింపు

మద్నూర్/జూలై 7/(జన సంఘర్షణ)
మద్నూర్ మండల కేంద్రంలో ఆరేళ్ల బాలిక కనిపించకుండా పోయిన ఘటన సోమవారం కలకలం రేపింది. మద్నూర్ మండలం మిర్జాపూర్ గ్రామానికి చెందిన హన్మంత్ కూతురు దుర్గ సోమవారం మద్నూర్లో జరిగే సంతకు తండ్రితో కలిసి వచ్చింది. మిర్చి బండి వద్ద తినుబండారం తింటున్న సమయంలో అకస్మాత్తుగా బాలిక కనిపించకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సీసీ పుటేజీలు పరిశీలించి, స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. మద్నూర్ మండలం తడి హిప్పర్గా గ్రామానికి చెందిన వ్యక్తి బాలికను తీసుకెళ్లి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మహారాష్ట్రలోని దెగ్లూర్ పట్టణంలోనూ గాలించుతున్నారు. నిన్నటి నుంచి బాలిక జాడ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జన సంఘర్షణ
బుధవారం 08 జులై 2026

# రష్యా వర్క్ పర్మిట్ పేరుతో రూ.9.37 లక్షల మోసం అంతర్ జిల్లా వ్యక్తి అరెస్ట్

- నిందితుడి నుంచి నగదు, పాస్పోర్టులు, బైక్ స్వాధీనం
- డిఎస్పి యస్. మధుసూదన్ వెల్లడి

కామారెడ్డి బ్యూరో./జులై 7/(జన సంఘర్షణ)

రష్యాలో వర్క్ పర్మిట్ వీసాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.9.37 లక్షలు మోసం చేసిన కేసును కామారెడ్డి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు.


**ఎలా జరిగింది మోసం?**

మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని మైసమ్మ చెరువు తండాకు చెందిన బుక్యా నరేష్, అతని స్నేహితులకు రష్యాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిందితుడు నమ్మించాడు. వీసా ప్రాసెసింగ్ పేరుతో మొత్తం రూ.9,37,000 వసూలు చేసి, అసలైన వర్క్ పర్మిట్ వీసాలు ఇవ్వకుండా నకిలీవి అందజేశాడు. బాధితుల పాస్పోర్టులను కూడా తిరిగి ఇవ్వకుండా మోసానికి పాల్పడ్డాడు. ఈ మేరకు ఫిర్యాదు అందడంతో మాచారెడ్డి పోలీస్ స్టేషన్లో ప్రధాన నిందితుడు గలేటి వెంకటయ్య ఏ వెంకటేష్ ఏ వెంకట్, అతని ఇద్దరు సహచరులపై కేసు నమోదు చేశారు. అరెస్ట్ ఇలా జరిగింది. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు కామారెడ్డి డీఎస్పీ యస్. మధుసూదన్ పర్యవేక్షణలో, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, మాచారెడ్డి ఎస్ఐ అనిల్, సిబ్బంది కేసును దర్యాప్తు చేశారు. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ ఆధారాలు, సాంకేతిక సమాచారాన్ని విశ్లేషించారు. 6-07-2026న మాచారెడ్డి పోలీస్ స్టేషన్ ఎదుట వాహన తనిఖీల్లో ప్రధాన నిందితుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా, సహచరులతో కలిసి విదేశీ ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసి నకిలీ వీసాలు ఇచ్చినట్లు అంగీకరించాడు. స్వాధీనం చేసిన సొత్తునిందితుడి వద్ద నుంచి పోలీసులు రూ.45,000 బాధితులైన భుక్యా జితేందర్, గుగులోత్ సురేష్, మలోత్ నితిన్లకు చెందిన భారతీయ పాస్పోర్టులు ఒక మొబైల్ ఫోన్ మోసం చేసిన డబ్బుతో కొన్న హీరో ప్యాషన్ ప్లస్ మోటార్ సైకిల్ను స్వాధీనం చేసుకున్నారు. మరో బాధితుడు బుక్యా నరేష్ పాస్పోర్టు సహ నిందితుడి వద్ద ఉన్నట్లు నిందితుడు తెలిపాడు. పరారీలో ఉన్న సహ నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి. ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడి వివరాలుగలేటి వెంకటయ్యనిజామాబాద్ జిల్లా.

**ప్రజలకు ఎస్పీ సూచన**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పే వ్యక్తులు లేదా అనధికారిక మధ్యవర్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని సూచించారు. విదేశీ ఉద్యోగాల కోసం తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి పొందిన





రిక్రూట్మెంట్ ఏజెన్సీల ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. విదేశీ ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా లేదా అనుమానాస్పదంగా వ్యవహరించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# ఈ నెల 18న చెక్ బౌన్స్ కేసుల స్పెషల్ లోక్ అదాలత్

- కోర్టులలో మొత్తం 1831 చెక్ బౌన్స్ కేసులు
- రాజీకి వీలుగా ఉన్నవి 264
- నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారత లక్ష్మీ

నిజామాబాద్ /జులై 7/(జన సంఘర్షణ)

చెక్ బౌన్స్ కేసుల పరిష్కారమే ధ్యేయంగా జులై 18 న స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ జీవిఎన్ భారత లక్ష్మీ తెలిపారు. వ్యక్తిగత,ఇతర అవసరాల కోసం అప్పు తీసుకున్న వారు, అప్పు ఇచ్చిన వారికి మధ్యన నడుస్తున్న చెక్ బౌన్స్ కేసులను రాజీ బాటలో నడిపించి ఒక పరిష్కారాన్ని చూపడానికే స్పెషల్ లోక్ అదాలత్ కు శ్రీకారం చుట్టుకున్నామని తెలిపారు. జిల్లాకోర్టు సముదాయంలోని బార్ సమావేశపు హాల్ లో మంగళవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నీలకంఠ రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె న్యాయవాదులనుద్దేశించి ప్రసంగించారు. ఆర్మూర్, బోధన్ కోర్టులతో పాటు నిజామాబాద్ జిల్లాకోర్టు ప్రాంగణంలోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులలో 1782 చెక్ బౌన్స్ కేసులు న్యాయ విచారణ దశలో ఉన్నాయని ఆమె వివరించారు. నిజామాబాద్ సెషన్స్ కోర్టు, నిజామాబాద్ అదనపు సెషన్స్ కోర్టులతో పాటు బోధన్ లో ఉన్న అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో 49 చెక్ బౌన్స్ క్రిమినల్ అప్పీళ్ళు విచారణలో ఉన్నాయని ఆమె తెలిపారు. చెక్ బౌన్స్ కేసులు మొత్తం 1832 లలో 264 కేసులు రాజీపద్ధతిన పరిష్కరించడానికి వీలుగా ఉన్నాయని భారత వివరించారు. కేసులలో నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ముద్దాయిలు కోర్టు వాయిదాలకు రాకపోవడంతో 391 మందిపైన నాన్ బెయిలెబుల్ వారంట్లు పెండింగ్లోఉన్నాయని తెలిపారు. 254 కేసులలో ముద్దాయిలు కోర్టుకు హాజరు కావాలని తెలుపుతూ సమన్స్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.వ్యక్తిగత రుణాలు రుణ గ్రహీతల నుండి తీసుకున్న వారు, ప్రయివేట్ సంస్థల నుండి అప్పు తీసుకున్న కక్షిదారులు తమ న్యాయవాదులను సంప్రదించి స్పెషల్ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.అప్పుల కుప్పలో కూరుకుపోకుండా,చెక్ బౌన్స్ కేసు ఊబి నుండి బయట పడటానికి స్పెషల్ లోక్ అదాలత్ ఒక మంచి అవకాశమని ఆమె అన్నారు.నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నీలకంఠ రావు మాట్లాడుతూ ప్రత్యేకంగా చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసమే స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించడం న్యాయసేవ అధికార సంస్థ చరిత్రలో కలికితురాయిగా నిలిచిపోతుందని అన్నారు.ప్రతి లోక్




అదాలత్ కు సహకరిస్తున్న తీరుగానే స్పెషల్ లోక్ అదాలత్ విజయానికి న్యాయవాదులు సహాయ,సహకారాలు అందిస్తారని తెలిపారు. బార్ ప్రధాన కార్యదర్శి నల్ల సుభాష్ రెడ్డి మాట్లాడుతూ అప్పు తీసుకున్న వారికి అప్పులభారం ఉండరాదని, భారాన్ని తొలగించుకోవడానికి రుణగ్రహీతలకు చెక్ బౌన్స్ కేసుల స్పెషల్ లోక్ అదాలత్ మంచిమార్గమని అన్నారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు జీవి. కృపాకర్ రెడ్డి, పరుచూరి శ్రీధర్, నరేందర్ రెడ్డి,మాణిక్ రాజు, జగన్ మోహన్ గౌడ్,బార్ కోశాధికారి మధుసుధన్ గౌడ్, క్రీడల కార్యదర్శి పుణ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.


# కాపర్ కాయిల్స్‌ల దొంగల పట్టివేత

- ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు 74 కిలోల కాపర్ కాయిల్స్
- చోరికి వినియోగించిన వాహనాలు సీజ్
- పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

వేల్పూర్/జులై 7/(జన సంఘర్షణ)

ఆర్మూర్ సబ్ డివిజన్ పరిధిలో పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల నుంచి రాగి కాయిల్స్ లను దొంగతనం చేస్తున్న ఆరుగురిని, దొంగిలించిన రాగి కాయిల్స్ లను కొనుగోలు చేసిన ఒక్కరిని అరెస్టు చేసినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు.. మంగళవారం వేల్పూర్ పోలీస్ స్టేషన్ లో పోలీస్ కమిషనర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ … ఆర్మూర్ పట్టణంలో పోచమ్మ గల్లి కి చెందిన కర్రె వినోద్ కుమార్, అంద్రాసి నవీన్, గుంజల్ల ఈశ్వర్, బాజా హరిప్రసాద్, కర్రె విజయకుమార్, మూల దుర్గ ప్రసాద్ రెడ్డి లు జల్సాలకు అలవాటు పడి చోరిలకు పాల్ పడుతున్నారన్నారు. వినోద్, విజయ్ ఇద్దరు అన్నదమ్ములు కలిసి పాత ఇనుప సామాను పేరుతో ఆర్మూర్ డివిజన్ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల్లో పట్ట పగలు తిరుగుతూ, రాత్రివేళ ఆరుగురితో కలిసి ట్రాన్స్ పార్మర్ లు పగల గోటి రాగి తీగలు దొంగతనాలు చేస్తూఅబ్దుల్ వసీం విక్రయించే వారని తెలిపారు. పాత నేరస్తుడు ఐనా సాప్ వ్యాపారి అబ్దుల్ వసీం హైమద్ అలియాస్ తిల్లిబాబా సలహా మేరకు ఆరుగురు ముఠాగా ఏర్పడి ఆర్మూర్ డివిజన్ పరిధిలోని గ్రామాలలోని చుట్టుపక్కల వ్యవసాయ ప్రాంతలలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ లను ధ్వంసం చేయడం రాగి తీగలు దొంగతనం వీరిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు సైతం నమోదైనట్లు ఆయన తెలిపారు. మంగళవారం కర్రె వినోద్ కుమార్, అంద్రాసి నవీన్, గుంజల్ల ఈశ్వర్, బాజా హరిప్రసాద్, కర్రె విజయకుమార్, మూల దుర్గ ప్రసాద్ రెడ్డి వేల్పూర్ మండలం లో పడిగెల గ్రామ శివారులో గల రైల్వే బ్రిడ్జి వద్ద పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారని, దొంగతనం చేసిన సొత్తును సైతం నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. దొంగ సొత్తు కొనుగోలు చేసిన నిందితులు అబ్దుల్ వాసిం సైతం ఆర్మూర్లో పట్టుకోవడం జరిగిందన్నారు. నిందితులఅబ్దుల్ వాసిం సైతం ఆర్మూర్లో పట్టుకోవడం జరిగిందన్నారు. నిందితుల నుంచి 74 కిలోల రాగి తీగలు, బజాజ్ మాక్సిమా ట్రాలీ ఆటో, హోండా షైన్ మోటార్ సైకిల్, యమహా స్కూటీ, బజాజ్ డిస్కవర్ మోటార్ సైకిల్, ఐదు మొబైల్ ఫోన్లు, దొంగతనం చేసేందుకు ఉపయోగించిన పనిముట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అబ్దుల్ వసీం అలియాస్ తిల్లి బాబా పై గతంలో ఆర్మూర్, మెండోర, నిజామాబాద్ నాల్గవ టౌన్ పి.ఎస్ లో చోరీ సొత్తు కొన్న కేసులు కలవు. నిందితులు వేల్పూర్ పి.ఎస్ లో 4 కేసులు, బాల్కొండ లో 5 కేసులు, మెండోర లో 3 కేసులు, భీంగల్ లో ఒక కేస్, ఆర్మూర్ లో 5 కేసులు, యెర్గట్ల పి. ఎస్ లో ఒక కేస్, మొత్తం 19 కేసులో నిందితులుగా ఉన్నారన్నారు.ఈ కేసు చేదించిన ముఖ్యపాత్ర పోషించిన ఆర్మూర్ రూరల్






సీఐ. జాన్ రెడ్డి, వేల్పూర్ మండల ఎస్సై, సంజీవ్, బాల్కొండ ఎస్సై.శైలేందర్, మెండోరా పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ భరత్ గౌడ్, వేల్పూర్ మండలం పోలీస్ కానిస్టేబుల్ నరేందర్, హెడ్ కానిస్టేబుల్ హరీష్, ముప్కాల్ మండల పోలీస్ కానిస్టేబుల్ సాయి కిరణ్, వేల్పూర్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పీ. శ్రావణ్, వేల్పూర్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సుదర్శన్ లను జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అభినందించారు.

# సమాజ సేవలో టీజీ ఎన్పీడీసీఎల్ చారిటబుల్ ట్రస్ట్ అన్నాశ్రమంకు 20000 చెక్కు అందజేత

కోటగిరి/ జూలై7/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల పరిధిలోని ఎట్లాస్పూర్ దుబ్బ అన్నాశ్రమంలో ఎన్పీడీసీఎల్ ఉద్యోగస్తులు ప్రతి నెల టీజీ ఎంపీడీసీఎల్ చారిటబుల్ ట్రస్ట్ వారి జీతాల నుంచి కాంట్రిబ్యూషన్ చేస్తూ గత సంవత్సరం నుంచి నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ ఆర్థిక చేయూతను ప్రతినెల 20వేల చొప్పున ఒక సంస్థకు సంవత్సర కాలం అందజేస్తుంది గౌరవ సీఎం డి శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్ ఆధ్వర్యంలో ఎన్పీడీసీఎల్ కంపెనీ ఈ సంవత్సరం 11 సంస్థలకు ఇవ్వడానికి నిర్ణయించింది దాంట్లో భాగంగా ఈరోజు నిజాంబాద్ జిల్లాలో కోటగిరి మండలంలోని ఎక్లాస్పూర్ క్లాస్ ప్రోగ్రాం లో గుమ్మడి ఫౌండేషన్ ఎన్జీవో కు సంవత్సర కాలం పాటు ప్రతి నెల 20000 చెక్కు ద్వారా నిజాంబాద్ జిల్లా ఎస్ ఈ శ్రీ పివి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో చెక్కును గుమ్మడి ఫౌండేషన్ ప్రతినిధికి అందజేయడం జరిగింది గుమ్మడి ఫౌండేషన్ అనాధ బాలలకు చేయూతను అందజేస్తున్నందుకు వారిని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఈ ఆపరేషన్ బోధన్ ఎండి ముక్తార్, డి ఈ టెక్నికల్ వెంకటరమణ, తోట రాజశేఖర్ ఏ డి ఈ , వివిధ సంఘాల ప్రతినిధులు రాజేందర్ గౌడ్, వేణుగోపాల్, గంగారాం నాయక్, సురేష్ కుమార్ స్థానిక ఏ ఈ బుజ్జి బాబు, గుమ్మడి ఫౌండేషన్ బాల ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఢిల్లీ హైకోర్టులో కవితకు చుక్కెదురు

- ఇప్పటి వార్త.. ఇప్పుడే
- ఈసీ విధులలో జోక్యం చేసుకోలేమన్న హై కోర్టు ధర్మసనం
- ఈసీ అభ్యంతరాలకు సమాధానం ఇచ్చి రండి

ఢిల్లీ/జూలై 7/(జన సంఘర్షణ)





తన నూతన పార్టీకి 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పేరును కేటాయించాలంటూ కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయి ంచారు. పాత పార్టీ ని పోలి ఉండే 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామం ప్రజల్లో గందరగోళానికి దారితీస్తుందని, ప్రత్యామ్నాయ పేర్లు సూచించాలని జూన్ 23న కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) జారీ చేసిన నోటీసులను ఆమె కోర్టులో సవాలు చేశారు. మంగళవారం కవిత పిటిషన్పై విచారణ జరిపిన ధర్మాసనం.. ముందుగా ఈసీ లేవనెత్తిన అభ్యంతరాలకు సరైన సమాధానం ఇవ్వాలని కవితకు స్పష్టం చేసింది. ఈ దశలో తాము జోక్యం చేసుకోవడం ఎన్నికల సంఘం విధుల్లో తలదూర్చడం అవుతుందని పేర్కొంటూ, ముందుగా ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని సూచించింది. టీఆర్ఎస్ పేరును కేటాయించడం సాధ్యం కాదంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది మే 12, జూన్ 23 తేదీల్లో జారీ చేసిన నోటీసులకు వారం రోజుల్లో సమాధానం ఇవ్వడానికి కవితకు అవకాశం కల్పిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# ఆల్ ఇండియా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఆల్కలాంబని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ

న్యూఢిల్లీ/జూలై 7/(జన సంఘర్షణ)

న్యూఢిల్లీ: కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ ఢిల్లీలోని ఆల్ ఇండియా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఆల్కలాంబ గారి నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలు, మహిళా సాధికారతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విస్తృతంగా చర్చించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, మహిళలను పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములను చేయడం, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా చేరవేయడంపై అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నారు. ఈ సందర్భంగా గడ్డం ఇందుప్రియ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, పార్టీ బలోపేతం కోసం తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.





# 100 ఏళ్లుగా మద్యం సీసా అడుగుపెట్టని స్ఫూర్తిదాయక గ్రామం..

సూర్యాపేట జిల్లా కోదాద/జూలై 7/(జన సంఘర్షణ)

మద్యం మనిషిని నాశనం చేస్తుంది... కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తుంది... సమాజాన్ని కలుషితం చేస్తుంది. మద్యపానాన్ని అరికట్టేందుకు ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రచారాలు నిర్వహిస్తున్నాయి. కానీ ఓ చిన్న గ్రామం మాత్రం... వందేళ్ల క్రితమే ఒక గొప్ప నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయానికి నేటికీ తలవంచ లేదు. తరాలు మారాయి... కాలం మారింది... కానీ ఆ గ్రామంలోకి మద్యం సీసా మాత్రం రాలేదు. అక్కడ మత్తుకు బదులు మానవత్వానికి విలువ ఉంది. ఆ గ్రామమేదో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే. మద్యం లేకుండా గ్రామం నడవదని భావించే కాలం ఇది. ప్రతి ఊరిలో బెల్ట్ షాపులు... ప్రతి వీధిలో మద్యం దుకాణాలు కనిపిస్తున్నాయి. కానీ సూర్యాపేట జిల్లా కోదాడ మున్సిపాలిటీలో విలీనమైన తమ్మర బండపాలెం మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా నిలుస్తోంది. ఈ ఊరిలో మొత్తం 91 కుటుంబాలు నివసిస్తున్నాయి. అందులో 60 ముస్లిం కుటుంబాలు, 30 ముదిరాజ్ కుటుంబాలు ఉన్నాయి. గ్రామ ప్రజల్లో ఎక్కువ మంది వ్యవసాయం, కూలీ పనులు, వెల్డింగ్ వృత్తి, చిన్న వ్యాపారాల ద్వారా జీవనం సాగిస్తున్నారు. మతాలు, కులాలు వేరైనా ... కానీ గ్రామ ప్రయోజనం విషయంలో మాత్రం అందరూ ఒక్కటే. సామాజిక ఐక్యతకు ఈ గ్రామం నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.



**వందేళ్ళుగా మద్యం సీసా అడుగు పెట్టని గ్రామం..**

వందేళ్లుగా మద్యం సీసా గ్రామంలోకి అడుగుపెట్టకుండా సామాజిక క్రమశిక్షణతో జీవిస్తోంది. గ్రామంలోకి అడుగుపెడితే ప్రశాంతత కనిపిస్తుంది. గొడవలు లేవు... మద్యం మత్తులో అల్లర్లు లేవు... బెల్ట్ షాపుల హడావిడి లేదు. ఇక్కడ మద్యం అమ్మడం నిషేధం... తాగడం కూడా నిషేధమే. ఎవరైనా మద్యం సేవించాలంటే గ్రామం బయటకే వెళ్లాల్సిన పరిస్థితి. శతాబ్దం క్రితం గ్రామ పెద్దలు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమే దీనికి కారణం. మద్యం కుటుంబాలను నాశనం చేస్తుందని.. గ్రామాభివృద్ధికి అడ్డుగా మారుతుందని భావించిన పెద్దలు స్వచ్ఛందంగా మద్యనిషేధాన్ని అమలు చేశారు. ఆ నిర్ణయాన్ని తరతరాలుగా గ్రామ ప్రజలు గౌరవిస్తూ వస్తున్నారు. కాలక్రమంలో గ్రామంలో బెల్ట్ షాపులు ఏర్పాటు చేయాలని కొందరు ప్రయత్నించినా... గ్రామస్తులంతా ఒక్కటై వాటిని అడ్డుకున్నారు. "మద్యం వద్దు... ప్రశాంతతే మాకు ముఖ్యం" అనే నినాదాన్ని చేతల్లో చూపించారు. కష్టపడి సంపాదించిన ప్రతి రూపాయి కుటుంబ అవసరాలకే ఖర్చవుతోంది. మద్యం కోసం సంపాదన వృథా కావడం లేదని గ్రామస్తులు గర్వంగా చెబుతున్నారు. మద్యం లేకపోవడంతో కుటుంబ కలహాలు, దాడులు, నేరాలు చాలా అరుదుగా జరుగుతున్నాయని గ్రామ పెద్దలు చెబుతున్నారు. గ్రామంలో పరస్పర సహకారం, ప్రశాంత వాతావరణం, సామాజిక ఐక్యత కొనసాగడానికి ఇదే ప్రధాన కారణమని చెబుతున్నారు. మద్యపానం నిషేధ సంప్రదాయాన్న కేవలం పెద్దలే కాదు... యువత కూడా అదే బాధ్యతతో ముందుకు తీసుకెళ్తోంది. కొత్త తరానికి మద్యం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ... గ్రామ నిర్ణయాన్ని భవిష్యత్ తరాలకు కూడా అందిస్తున్నారని స్థానిక నేతలు చెబుతున్నారు.వందేళ్లుగా మద్యం సీసా గ్రామంలోకి రానివ్వకుండా... కుటుంబాలను కాపాడుకుంటూ... ప్రశాంతతను పరిరక్షిస్తూ... సామాజిక ఐక్యతకు సజీవ సాక్ష్యంగా నిలిచింది ఈ గ్రామం. మద్యానికి నో చెప్పి... శాంతికి జై కొట్టిన ఈ గ్రామం... అందరికీ ఆదర్శప్రాయం. నిజంగా తెలంగాణకు కూడా గర్వకారణమే.

# బోధన్ ఏకచక్ర నగర్లో ఘనంగా గంగపుత్ర మరాఠా సంఘం బోనాల పండుగ





బోధన్/జూలై 7/(జన సంఘర్షణ)

బోధన్ పట్టణంలోని ఏకచక్ర నగర్లో గంగపుత్ర మరాఠా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో, డప్పు వాయిద్యాల మధ్య సంప్రదాయ వస్త్రధారణలో ఉన్న మహిళలు తమ నెత్తిన బోనాలను ఎత్తుకొని కాలనీ నుండి మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అక్కడ వారు ప్రత్యేక పూజలు చేసి, తమ మొక్కులను సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమానికి 15వ వార్డు కౌన్సిలర్ గుమ్ముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, గంగపుత్ర మరాఠా సంఘ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అశోక్ రెడ్డి ప్రజలందరికీ బోనాల శుభాకాంక్షలు తెలియజేస్తూ ఐక్యతను, సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించడంలో ఇటువంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గంగపుత్ర మరాఠా సంఘం అధ్యక్షుడు గటుమల్ సాగర్తో పాటు సుభాష్, దశరథ్, తానాజీ, సీతారాం, గణేష్, దీపక్, పవన్, బాపూజీ వంటి సభ్యులు, అలాగే మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేశారు.

# అస్తవ్యస్థంగా గురుకుల పాఠశాలలోని మరుగు దొడ్లు...!

- ఈ గురుకులంలో అవస్థలకు అధికారులు ప్రజా ప్రతినిధులు చాలా కాలం నుండి మౌనం ఎందుకు?
- తలుపులు లేని మరుడు దొడ్లు మలమూత్ర విసర్జనతో నిండి కంపు కొడుతున్న బాత్రూములు
- గురుకుల పేద విద్యార్థుల కష్టాల ముగింపు ఎపుడు.
- కొందుర్గ్ గురుకుల పాఠశాలలో మరి అద్వాన స్థితిలో బాత్రూమ్‌లు
- విద్యార్థులుకు ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తున్న ఆది స్కేత్ర స్థాయిలో మాత్రం శూన్యం..



షాద్నగర్/జూలై 7/(జన సంఘర్షణ)

షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గ్ మండల కేంద్రంలో నీ స్థానిక గురుకుల పాఠశాల లో నేడు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొందుర్గ మండల మాదిగ దండోరా అధ్యక్షులు అనేగాళ్ల ఆనంద్ మాదిగ ఆధ్వర్యంలో గురుకులం లో ప్రత్యేకంగా కలియ తిరగటం జరిగింది. భవనంలోని నాలుగు అంతస్తులలో గల పారిశుధ్య పరిస్థితులు చాలా అధ్వానంగా పూర్తిగా చిన్న బిన్నమైన పరిస్థితులలో బాత్రూంలో పూర్తిగా మళ్ళంతో నిండిపోయిన స్థితిలో మల మూత్ర విసర్జనలో కూరుకుపోయి ఉనాయి అవి నిరుపయిగనగా తయారయ్యాయని అసలు పూర్తిగా పనిచేయటం లేదని విద్యార్థులు తెలిపారు. స్వయాన అక్కడికి వెళ్లి చూడగా అవి చాలా దుర్గంధ స్థితిలో నిండి కంపు కొడుతూ దుర్భంధ భరితంగా ఉన్నాయి. పూర్తిగా నిండిన విసర్జన శాలలు మలం, మూత్రాలతో నిరుపయోగ స్థితిలో ఉనాయి. ఇక్కడ ఇంత దీన, దుర్గంధ స్థితిలో ఉన్నా ఈ ప్రభుత్వ అధికారి మాత్రం ఏ ప్రజా ప్రతినిధి శేత్ర స్థాయిలో పరిశీలించకపోవటం చాలా అనుమానాలకు ఆద్యం పోస్తోంది. ఈసందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కొందుర్గ్ మండల అధ్యక్షులు అనేగాళ్ల ఆనంద్ మాదిగ మాట్లాడుతూ వసతి సౌకర్యాలకు విద్యార్థులకు సరిగ్గా లేవని విద్యార్థులు మాల మూత్ర విసర్జన దుర్గంధాలతో విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతిని చదువు అంటేనే అన్నారు.

# ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పటిష్టంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

పూతలపట్టు జూలై 7(జన సంఘర్షణ)

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించి తప్పులు లేని ఓటర్ల జాబితానురూపొందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పూతలపట్టు మండలం తలుపుల పల్లె గ్రామంలోని బంధార్లపల్లి (పీఎస్-59), కర్ణంవారిపల్లి--పోటుగనుమ (పీఎస్-49), అలాగే ఐరాల మండలం పొలకలలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ సర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల నమోదు, డిజిటలైజేషన్ ప్రక్రియలను పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజలతో మాట్లాడుతూ 2002 ఓటర్ లిస్ట్‌లో మీ అమ్మ లేదా నాన్న పేరు సీరియల్నెంబర్తెలుసుకోవాలన్నారు. అలా చేయకపోతే మీరు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.బి, ఎల్వో,లు ఇంటి వద్దకు వచ్చినప్పుడు ఓటు కోల్పోకుండా చూసుకోవడం మన అందరి బాధ్యత, తప్పకుండా మ్యాపింగ్ చేయించుకోవాలన్నారు. 2002 సర్ ఓటర్ లిస్టులో పేరు ఉండి అదేవిధంగా 2025 ఓటర్ లిస్టులో పేరు ఉన్నవారు కూడా సెల్ఫ్ మ్యాపింగ్ చేయించుకుంటే మంచిదిఅన్నారు.అలాంటివారు బి, ఎల్, వో,లు వద్దకు వెళ్లి సెల్ఫ్ మ్యాపింగ్ అని చెప్పాలన్నారు. 2002 సమయంలో ఓటు హక్కు వయసు లేకపోయినా పేరు లేకపోయినా 2025 ఓటర్ లిస్టులో పేరు ఉన్నవారికి మ్యాపింగ్ వర్తిస్తుందన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరుజాబితాలోనమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను నిబంధనల మేరకు నమోదు చేయాలని సూచించారు. సేకరించిన సమాచారాన్ని వెంటనే డిజిటలైజ్ చేసి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటర్ల జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, తహసిల్దార్ ఉదయ్ సంతోష్. సంబంధిత బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక గంజా ర్యాపిడ్ టెస్ట్ కార్యక్రమం

- 259 మందికి గంజా ర్యాపిడ్ టెస్ట్ నిర్వహణ.

తిరుపతి/(జన సంఘర్షణ)/జూలై 07:




తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బారాయుడు, ఐపీఎస్. ఆదేశాల మేరకు తిరుపతి సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనతో పాటు యువతలో మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా, ఈ రోజు ఉదయం తిరుపతిలోని హరే రామ హరే కృష్ణ (ఇస్కాన్ టెంపుల్) సమీపంలోని గ్రౌండ్‌లో గంజా ర్యాపిడ్ టెస్ట్ ద్వారా ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు, స్విగ్గీ, జొమాటో డెలివరీ సిబ్బంది, టాక్సీ డ్రైవర్లు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు, రౌడీ షీటర్లు, అనుమానిత వ్యక్తులు తదితరులకు కలిపి మొత్తం 259 మందికి యూరిన్ నమూనాలను సేకరించి గంజా ర్యాపిడ్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షల్లో గంజాయి వినియోగం ఉన్నట్లు నిర్ధారణ అయిన వ్యక్తి ద్వారా, సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని, గంజాయిని ఎక్కడి నుండి కొనుగోలు చేశాడు, ఎవరి ద్వారా సరఫరా జరిగింది, కొనుగోలు విధానం, పంపిణీ నెట్‌వర్క్ తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టనున్నారు. అలాగే అతనికి మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై కౌన్సెలింగ్ నిర్వహించి, విచారణలో లభించే ఆధారాల మేరకు ఎన్‌డీపీఎస్ (చీణూూ) చట్టం ప్రకారం తగిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమం ద్వారా మాదక ద్రవ్యాల వినియోగదారులను గుర్తించడం మాత్రమే కాకుండా, వాటి మూలాలు, సరఫరాదారులు, పంపిణీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఛేదించడమే ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, ఐపీఎస్.మాట్లాడుతూ.. "మాదక ద్రవ్యాల నిర్మూలనకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. గంజా లేదా ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, నిల్వ, రవాణా, విక్రయం లేదా సరఫరాలో పాల్గొనే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలి. ప్రజలు కూడా మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించి సమాజాన్ని రక్షించడంలో భాగస్వాములు కావాలి" అని సూచించారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు, గంజా ర్యాపిడ్ టెస్టులు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తూ, మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం కట్టుబడి పనిచేస్తుందని వెల్లడించారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా అత్యవసర సేవల నంబర్ 112కు సమాచారం అందించాలని తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే తొలి లక్ష్యం

- కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

నెల్లూరు జిల్లా-(జన సంఘర్షణ):



కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మంగళవారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా సంక్షేమం, ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే కూటమి ప్రభుత్వ తొలి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# నెల్లూరు జిల్లాలో విచ్చలవిడిగా డ్రగ్స్ సంస్కృతి

నెల్లూరుజిల్లా-(జన సంఘర్షణ)

గతంలో ఎంతో ప్రశాంత వాతావరణానికి, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సైతం ఇష్టపడే పోస్టింగ్ స్థానంగా ఉన్న నెల్లూరు జిల్లా, నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక "క్రైమ్ క్యాపిటల్ ఆఫ్ ఆంధ్ర" గా మారిపోయిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశ్రిత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతలు క్షీణించాయని, విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. ఆశ్రిత్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తున్నా రాష్ట్రంలో నేరాలను, గంజాయి సరఫరాను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గంజాయిపై ఎన్నో మాటలు మాట్లాడిన హోంమంత్రి అనిత, ఇప్పుడు అధికారంలో ఉండి రాష్ట్రంలో జరుగుతున్న నేరాలు, గంజాయి విక్రయాలపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో సరికొత్తగా విస్తరిస్తున్న డ్రగ్స్ కల్చర్ యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని హెచ్చరించారు. గత నెల 27, 28 తేదీల్లో వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు జరిపిన సోదాల్లో అత్యంత ప్రమాదకరమైన 'ఎండిఎంఏ' డ్రగ్ దొరకడం కలకలం రేపుతోందన్నారు. పక్క రాష్ట్రాల నుండి కేవలం రూ. 1500 లకే గ్రాము డ్రగ్ కొనుగోలు చేసి తీసుకొచ్చి, నెల్లూరులోని మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులను టార్గెట్ చేస్తున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
బుధవారం
08 జులై 2026

# డిఫరెంట్ లుక్‌లో డ్రాగన్... ఎన్టీఆర్




ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ డ్రాగన్ . ఈ సినిమాలోని తన పాత్ర కోసం తారక్ ఎన్నడూ లేని విధంగా భారీగా బరువు తగ్గారు. ఆ మధ్య బయటకు వచ్చిన తారక్ అల్ట్రా స్లిమ్ మేకోవర్ చూసి అభిమానులు ఒకింత షాక్‌కు గురయ్యారు. ఒక సినిమా కోసం ఇంతలా బరువు తగ్గాలా అని కంగారు పడుతూ, తమ హీరో లుక్ చూసి అభిమానులతో పాటు సగటు సినీ ప్రేక్షకులు కూడా తీవ్ర ఆందోళన చెందారు. అయితే, ఎన్టీఆర్ బర్త్‌డే కానుకగా విడుదలైన 'డ్రాగన్' గ్లింప్స్ చూసి ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయినప్పటికీ, ఆ లుక్ వెనుక ఉన్న తారక్ కష్టం వారిని ఇబ్బంది పెడుతూనే వచ్చింది. ఇందులో 'లూగర్' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్ లుక్ కోసం ఎన్టీఆర్ తన ప్రాణం పెట్టి పనిచేశారు. సినిమా కోసం, తను నమ్మిన పాత్ర కోసం తారక్ ఎంతటి రిస్క్ అయినా తీసుకోగలడు, ఏ స్థాయికైనా వెళ్లగలడు అని తన అంకితభావంతో మరోసారి నిరూపించారు. క్యారెక్టర్‌లోని ఇంటెన్సిటీ చూశాక ప్రశాంత్ నీల్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విధ్వంసం సృష్టించబోతున్నాడో అని అందరిలో ఆసక్తి రెట్టింపయింది. అభిమానుల్లో ఉన్న ఆ టెన్షన్‌ను పటాపంచలు చేస్తూ జూలై 6న సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. అక్కినేని అఖిల్ నటిస్తున్న 'లెనిన్' మూవీ కోసం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ విషయాన్ని పంచుకుంటూ అఖిల్ తన సోషల్ మీడియాలో తారక్‌తో దిగిన లేటెస్ట్ ఫొటోలను షేర్ చేశారు. ఆ ఫొటోలు చూసిన అభిమానులు ఒక్కసారిగా హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ఎన్టీఆర్ ఇప్పటికీ స్లిమ్‌గానే ఉన్నప్పటికీ, మునపటి కంటే ఎంతో ఫ్రెష్‌గా, గ్లోయింగ్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తుండడంతో నెట్టింట కామెంట్ల వర్షం కురుస్తోంది. ఈ సరికొత్త లుక్ చూసి కుదుటపడిన ఫ్యాన్స్, ఇక 'డ్రాగన్' సినిమాలో తారక్ విశ్వరూపం ఎలా ఉండబోతుందో అని ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాలో ఊరమాస్, హై-వోల్టేజ్ యాక్షన్ రోల్ తర్వాత.. త్రివిక్రమ్ మైథాలజికల్ సినిమాలో ఎన్టీఆర్ ఎలా కనిపిస్తారు? అక్కడ తన మేకోవర్ ఎలా ఉండబోతోంది? అనే ఆసక్తి అప్పుడే టాలీవుడ్ వర్గాల్లో మొదలైంది.

# హైదరాబాద్‌లో శరవేగంగా చిరు మూవీ షూట్




చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. మెగా158 వర్కింగ్ టైటిల్ గా ప్రచారంలో ఉన్న దీనిపై టీమ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోందని తెలిపింది. మునుపెన్నడూ చూడని భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని.. చిరును కొత్త కోణంలో చూస్తారని వెల్లడించింది. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ సారథ్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు షూట్ చేస్తున్నారు. సినిమాకు ఈ సీన్స్ హైలైట్‌గా నిలవనున్నాయి. చిరు ఇందులో రిస్క్‌తో కూడిన స్టంట్స్ చేస్తున్నారని.. త్వరలో దీని టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. 'వాల్తేర్ వీరయ్య' విజయం తర్వాత చిరంజీవి - బాబీ కాంబోలో ఈ చిత్రం రానుండడంతో అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే పొల్లాచ్చిలో ఓ కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు కొన్ని యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రాన్ని కూడా విడుదల చేశారు.

# టిక్కెట్ ధరలు..పాప్‌కార్న్ రేట్లు

### నాగవంశీ కామెంట్స్‌పై చర్చ



టాలీవుడ్ నిర్మాత నాగవంశీ లెనిన్ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా చేసిన టికెట్ ధరల వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఒక ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ.. ప్రేక్షకులు థియేటర్లకు రాకపోవడానికి అధిక టికెట్ ధరలు కారణమా, లేక లోపల అమ్మే పాప్‌కార్న్, వాటర్ బాటిల్స్ వంటి తినుబండారాల రేట్లు కారణమా అనేదానిపై సర్వే చేయాలంటూ ఆయన పేర్కొన్నారు. జనాలు టికెట్ ధరల గురించి పట్టించుకోట్లేదని థియేటర్ లోపల ఉన్న పాప్‌కార్న్ ధరల వలనే ప్రేక్షకులు సినిమాలకు రాలేకపోతున్నారని కామెంట్లు చేశాడు. అయితే ఈ వ్యాఖ్యలపై నెటిజన్ల నుంచి భిన్నమైన స్పందన రావడమే కాకుండా ఈ విషయంలో నాగవంశీ విమర్శించడం మొదలుపెట్టారు. పెద్ద సినిమాలు విడుదలైనప్పుడు ప్రభుత్వాల నుంచి ప్రత్యేక అనుమతులు తెచ్చుకుని మరీ టికెట్ రేట్లు పెంచడం వల్ల, ఒక మధ్యతరగతి కుటుంబం థియేటర్‌కు వెళ్లి సినిమా చూడటం అనేది భారంగా మారిందని ప్రేక్షకులు వాపోతున్నారు. థియేటర్‌లో ఫుడ్ కొనాలా వద్దా అనేది తమ ఇష్టమని, కానీ సినిమా చూడాలంటే టికెట్ తప్పనిసరి కాబట్టి ముందుగా టికెట్ ధరలను అదుపులోకి తేవాలని చాలా మంది డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో మల్టీప్లెక్సుల్లో లభించే పాప్‌కార్న్, కూల్‌డ్రింక్స్ ధరలు బయట కంటే కొన్ని రెట్లు ఎక్కువగా ఉండటం కూడా థియేటర్ అనుభవాన్ని మరింత ఖరీదైనదిగా మారుస్తోంది. ఈ మితిమీరిన ఖర్చుల వల్లే ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్ల వైపు వెళ్లకుండా, కొన్ని వారాలు ఓపిక పట్టి ఓటీటీల్లోనే సినిమాలను చూసేందుకు మొగ్గు చూపుతున్నారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు టికెట్ల ద్వారా వచ్చే లాభాల్లో సింహభాగం నిర్మాతలు, పంపిణీదారులకే వెళ్తుందని, కేవలం థియేటర్ నిర్వహణ, సిబ్బంది జీతాలు, కరెంట్ బిల్లుల కోసమే తాము ఫుడ్ అండ్ బెవరేజెస్ అమ్మకాలపై ఆధారపడాల్సి వస్తోందని వారు సమర్థించుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ, ప్రేక్షకులను మళ్లీ థియేటర్ల వైపు రప్పించాలంటే కేవలం టికెట్ ధరలు లేదా కేవలం ఫుడ్ రేట్లు మాత్రమే కాకుండా, సినిమా చూసే మొత్తం వ్యయాన్ని తగ్గించి సామాన్యుడికి అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత చిత్ర పరిశ్రమ, థియేటర్ యాజమాన్యాల పై ఎంతైనా ఉందని నెటిజన్లు చెప్పుకోచ్చారు.

# అనిల్ రావిపూడి మల్టీస్టారర్

### షూటింగ్‌లో చేరిన వెంకటేశ్



టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న మల్టీస్టారర్ చిత్రాల్లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న కొత్త సినిమా ఒకటి. విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల కల్యాణ్ రామ్‌పై ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించిన చిత్రబృందం, ఇప్పుడు తదుపరి కీలక షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ షెడ్యూల్‌లో విక్టరీ వెంకటేష్ కూడా సెట్స్‌లోకి అడుగుపెట్టడంతో షూటింగ్ మరింత జోరందుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో వెంకటేష్, కల్యాణ్ రామ్‌తో పాటు హీరోయిన్లు కీర్తి సురేష్, కృతి శెట్టి పాల్గొంటున్నారు. ముఖ్యంగా వెంకటేష్,కల్యాణ్ రామ్‌ల మధ్య వచ్చే కీలక సన్నివేశాలు ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఇద్దరి పాత్రల మధ్య ఉండే కెమిస్ట్రీ, వినోదభరితమైన సంభాషణలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కుటుంబ కథా చిత్రాలకు వినోదాన్ని జోడించడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన అనిల్ రావిపూడి, ఈ సినిమాలో కూడా తన మార్క్ కామెడీ, భావోద్వేగాలతో ప్రేక్షకులను అలరించేలా కథను రూపొందించినట్లు తెలుస్తోంది. వెంకటేష్ కామెడీ టైమింగ్, కల్యాణ్ రామ్ మాస్ ఇమేజ్‌ను బ్యాలెన్స్ చేస్తూ పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్‌కు జోడీగా కృతి శెట్టి కనిపించనున్నారు. ఈ నాలుగు ప్రధాన పాత్రల చుట్టూనే కథ సాగనున్నట్లు తెలుస్తోంది. సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి. ఈ సినిమాకు సంగీతాన్ని జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తుండగా, సినిమాటోగ్రఫీ బాధ్యతలను సమీర్ రెడ్డి నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కల్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు మంచి స్పందన లభించగా, తాజా షూటింగ్ అప్‌డేట్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.

## చిత్రసీమలో ప్రతిభ ఉంటేనే రాణిస్తారు: రవిశంకర్

టాలీవుడ్‌లో నెపోటిజం అంశంపై ఎప్పుడూ ఏదో ఒక చర్చ నడుస్తూనే ఉంటుంది. తాజాగా ప్రముఖ నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' అధినేతల్లో ఒకరైన వై. రవిశంకర్ ఈ విషయంపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఇటీవల జరిగిన 'రాజా ది రాజా' చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర హీరో రిత్విక్‌ను ఉద్దేశించి వేదికపై రవిశంకర్ మాట్లాడుతూ.. సినిమా పరిశ్రమలో రాణించాలంటే బ్యాక్‌గ్రౌండ్ కంటే సొంత ప్రతిభే ముఖ్యమని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమలోకి ఎవరైనా గోల్డెన్ స్పూన్ లేదా డైమండ్ స్పూన్‌తో పుట్టి రావచ్చు కానీ ఇక్కడ అవేమీ పని చేయవని, మిమ్మల్ని నిలబెట్టేది కేవలం మీలో ఉన్న ప్రతిభ మాత్రమేనని ఆయన నొక్కి చెప్పారు. మన వెనుక ఎవరి అండా లేదని భావించి కష్టపడి ముందుకు సాగినప్పుడే నిజమైన విజయం దక్కుతుందంటూ హీరో రిత్విక్‌ను ప్రోత్సహిస్తూ ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రవిశంకర్ చేసిన ఈ కామెంట్స్ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. నరేష్, వైశాఖ ధీమన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి మార్క్ కె రాబిన్ సంగీతం అందిస్తున్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony, Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi.
RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co